
మార్కాపురంలోని పోలీసు స్టేషన్

- ఉన్నతాధికారుల ఆదేశాలు తూచ్
- చీకటి పడితేనే కేసు నమోదు
- పగలు ఫిర్యాదులు అందినా రాత్రి వరకూ ఆగాల్సిందే
- సెటిల్‌మెంట్లకే మొగ్గు
- చర్చనీయాంశమైన మార్కాపురం పోలీసుల తీరు

మారరంతే!

అనుకున్న మేరకు జేబులు నిండితే సరే. లెక్క ఏమాత్రం తగ్గిందా అప్పుడు చట్టం గుర్తుకు వచ్చి కేసులు నమోదవుతాయి. పంచాయితీల తతంగమంతా పగలు జరుగుతోంది. రాత్రుళ్లు మాత్రమే కేసులు నమోదు చేయడం ఆనవాయితీగా పెట్టుకుని దాన్ని కొనసాగిస్తున్నారు మార్కాపురం పోలీసులు. కిందిస్థాయి అధికారులు ఈవిధంగా వ్యవహరిస్తూ వివాదాలకు చోటిస్తున్నా పర్యవేక్షణ అధికారులు మిన్నకుండడం విమర్శలకు తావిస్తోంది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా అన్నిస్థాయిల వారికి చేతులు తడుస్తుండటం వల్లే ఇలాంటి వ్యవహారాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మార్కాపురం, సెప్టెంబరు 9 : ఫిర్యాదు అందిన వెంటనే ప్రాథమికంగా కేసు నమోదు చేయాలనేది పోలీసు ఉన్నతాధికారుల ఆదేశం. ఆతర్వాత విచారణలో కేసు తీవ్రతను బట్టి సెక్షన్లు మార్చుకునే వెసులుబాటు ఉంది. మార్కాపురం పోలీసులకు మాత్రం ఇవేం పట్టడం లేదు. ఫిర్యాదు ఎప్పుడు అందినా వారికి నచ్చినప్పుడు మాత్రమే కేసు నమోదు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కనబెట్టి రాజకీయ నాయకుల సిఫార్సులు, మధ్యవర్తుల బేరసారాలను బేరీజు వేసుకుని మాత్రమే పనిచేస్తున్నారు.

ఫిర్యాదు ఎప్పుడు అందినా రాత్రుళ్లే కేసు నమోదు

మార్కాపురం సర్కిల్ పరిధిలోని టౌన్, రూరల్ పోలీసు స్టేషన్‌లలో అధికారులు ఎవరు మారినా కొన్నేళ్ల నుంచి కేసులు నమోదు కావాలంటే చీకటి పడాల్సిందే. ఫిర్యాదు ప్రాధాన్యతను పక్కన బెడితే రాత్రి 8 గంటలు దాటిన తర్వాతనే కేసు నమోదవుతుంది. పగలు ఎలాంటి ఫిర్యాదు అందినా దాన్ని సాయంత్రం వరకు నాన్చడం అలవాటుగా చేసుకున్నారు. ఫిర్యాదు స్టేషన్‌కు వచ్చిన వెంటనే కొందరు మధ్యవర్తులు గద్దల్లా వాలుతున్నారు. వారు ఇరు పక్షాలను స్టేషన్ పరిసరాల్లోనే కూర్చోబెట్టి లెక్క సరిచేసి అధికారి వద్దకు పంపుతారు. ఇరుపక్షాలు సమ్మతించని పక్షంలోనే కేసు నమోదుకు మొగ్గుచూపుతున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులకు మధ్యవర్తిత్వం వహించేందుకు కొందరు అదేపనిగా స్టేషన్ చుట్టూ తిరుగుతుండటం గమనార్హం. వారిలో కుల సంఘాలకు చెందిన వాళ్లు కొందరైతే, సమాజంలో గౌరవప్రదమైన వృత్తుల్లో కొనసాగే వాళ్లు మరికొందరు ఉన్నారు. గతంలో పలువురు డివిజన్ స్థాయి పోలీసు అధికారులు ఈ తంతును వారించినా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

అడ్డుకట్ట వేసేదెవరు..

జిల్లా స్థాయిలోని పోలీసు ఉన్నతాధికారులు ప్రతి ఫిర్యాదుదారుడికి చట్టప్రకారం న్యాయం చేయాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. స్టేషన్‌కు కొత్త అధికారి వచ్చినా కిందిస్థాయి సిబ్బంది సూచనలు, సలహాల మేరకే నడుచుకుంటున్నారు. వారు చెప్పిందే వేదంగా పనిచేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రధానంగా భూలావాదేవీలు, నగదు లావాదేవీలకు సంబంధించిన కేసుల్లో కిందిస్థాయి సిబ్బంది కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఎవరికి ముట్టాల్సినవి వారికి అందుతుండటంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సాధారణ కేసుల్లో అయితే ఇరుపక్షాలు చేతులు తడిపితేనే కిందిస్థాయి సిబ్బంది అధికారి వద్దకు తీసుకెళ్తున్నారు. పోలీసు స్టేషన్‌లలో జరుగుతున్న ఈ తంతును ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేర్చాల్సిన నిఘా విభాగం కూడా పట్టించుకుంటున్న దాఖలాలు ఉండటం లేదు. నిఘా విభాగం సిబ్బంది ఏళ్లుగా పాతుకుపోయిన వాళ్లు కావడం కూడా వాస్తవాలు పైస్థాయి అధికారులకు తెలియకుండా మరుగున పడిపోవడానికి కారణమవుతోంది. జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విచారించి చర్యలు తీసుకుంటా



మార్కాపురం సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్‌లలో కేసుల నమోదు విషయంలో తాత్సారం, పంచాయితీలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. మార్కాపురం టౌన్, రూరల్ స్టేషన్‌ల పరిధిలో విచారించి తప్పక చర్యలు తీసుకుంటాం. అలాంటివి ఏమైనా ఉంటే వెంటనే అరికడతాం. ప్రజలకు తక్షణ న్యాయం అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం.

- బి.లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి డీఎస్పీ, మార్కాపురం


గిద్దలూరులో భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

నిమజ్జన సందడి

జిల్లాలో వినాయక నిమజ్జనాల సందడి మొదలైంది. చవితి అనంతరం మూడోరోజైన సోమవారం పలుప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విగ్రహాలను తరలించారు. డీజేలు, మేళతాళాలు, డప్పుల మోతల మధ్య రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ నిమజ్జన కార్యక్రమాలను ప్రజలు కోలాహలంగా నిర్వహించారు.

- ఒంగోలు కల్చరల్



నిధులు ఉన్నా ఏం చేయలేరు!

- గ్రామ పంచాయతీల ఖాతాల్లో రూ.40 కోట్లు
- డ్రా చేసేందుకు విధివిధానాలు ఇవ్వని ప్రభుత్వం
- మరోసారి విద్యుత్ బిల్లులు, కార్మికులకు వేతనాలు చెల్లించే అవకాశం
- పాలకవర్గాల్లో ఆందోళన

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 9 : గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ ఆర్థికసంఘం నిధులు ఇచ్చినా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామ పంచాయతీలకు నిధులు వచ్చి పక్షం గడుస్తున్నా వాటి వినియోగానికి సంబంధించి ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించకపోవడంతో పాలకవర్గాలు ఏమీచేయలేక ఎదురుచూస్తున్నాయి. జిల్లాలోని 729 గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా సుమారు రూ.40కోట్ల వరకూ వాటి ఖాతాల్లో ఉండిపోయాయి. ఇటీవల వరకు జిల్లాలోని అనేక గ్రామాల్లో చేపట్టిన పలు రకాల పనులకు సంబంధించిన బిల్లులు రాకపోగా, అత్యవసర పనులు చేసేందుకు చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితి కొనసాగింది. ప్రస్తుతం ఒక్కో పంచాయతీకి జనాభాను బట్టి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకూ జమయ్యాయి. వీటితో సత్వరమే పనులు చేపట్టేందుకు ఎక్కువ మంది సర్పంచ్‌లు సిద్ధమయ్యారు. కొంతమంది పాత బిల్లులు చేసుకునేందుకు చూస్తున్నారు. కొందరు అత్యవసర సమయంలో పంచాయతీలకు అవసరమైన లైట్లు, బ్లీచింగ్ వంటివి కొనుగోలు చేయాలని నిర్ణయించుకు న్నారు. కానీ ఆ బిల్లులను ఎం బుక్ చేయడం లేదు. మరోవైపు గతంలో చేసిన పనులకు కూడా ఇంజనీరింగ్ అధికారులు ఎంబుక్‌లు చేసేందుకు నిరాకరిస్తున్నట్లు సమాచారం.

ఈసారి కూడా అంతేనా

గ్రామ పంచాయతీలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధుల్లో కొంత మొత్తాన్ని ఈసారి కూడా విద్యుత్ చార్జీలకు చెల్లించాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో గత ప్రభుత్వంలోని పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న అనుమానాలు పాలకవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని అనేక గ్రామపంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించని పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో వారికి కూడా ఆర్థిక సంఘం నిధుల ద్వారా జీతాలు చెల్లిస్తే ఇక పంచాయతీల్లో నిధులు ఉండవని పాలకవర్గాలు చెప్తున్నాయి. ఏదిఏమైనా పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించి ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు ఇస్తేనే ఆ నిధుల వినియోగం ఎలాగన్నది తెలిసే అవకాశం ఉంటుంది.

ఉచిత ఇసుక విధానం క్రమబద్ధీకరణ

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : ఉచిత ఇసుక విధానాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఇసుక రవాణా చేసే లారీ యజమానులు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సోమవారం జిల్లా ఇసుక సమన్వయ కమిటీలోని అధికారులు, లారీ యజమానులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఉచిత ఇసుక విధానం గురించి వివరించారు. ఈ విధానంలో కొత్త మార్గదర్శకాల మేరకు పంపిణీ ఉంటుందన్నారు. పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో ఇసుకను అందజేస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా లారీ యజమానులు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 70 వాహనాలను రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. ఆయా వాహన యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎంప్యానల్ చేసుకోవాలన్నారు. లారీ, టిప్పర్ల సామర్థ్యాన్ని బట్టి ధరలు నిర్ణయిస్తామని కలెక్టర్ తెలిపారు. లారీలు ఇసుక కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోగానే ట్యాగ్ చేసిన వాహనదారుని మొబైల్ నెంబర్‌కు టైం, స్లాట్ వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా లారీ యజమానులు ఇసుక రవాణాకు సంబంధించి చార్జీలతోపాటు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆమె.. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. సమావేశంలో మైనింగ్ డీడీ జగన్నాథరావు, ఇరిగేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, మార్కాపురం మైనింగ్ ఏడీ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు

సొసైటీల్లో సభ్యుల కుదింపు

- ఉత్తర్వులు జారీచేసిన జాయింట్ కలెక్టర్
- వ్యతిరేకిస్తున్న రైతులు

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 9 : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యుల సంఖ్యను కుదించేందుకు రంగం సిద్ధమైంది. ఈమేరకు అధికార పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను ఆదేశిస్తూ జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యుల తొలగింపు ప్రక్రియను ఈనెల 10వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. దీనిపై రైతులు భగ్గుమంటున్నారు.

భూమిలేని రైతుల పేర్లు తొలగించాలి

సొసైటీ సభ్యుల్లో భూమి లేనివారు, సేవలను వినియోగించుకోని వారిని సభ్యత్వం నుంచి తొలగించనున్నారు. కేవలం భూములు ఉన్న రైతులు, కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న వారిని మాత్రమే సభ్యులుగా కొనసాగించాలని జేసీ ఉత్తర్వుల్లో సూచించారు. జిల్లాలోని 93 సొసైటీల్లో 3.22 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో మెజారిటీ సభ్యులకు భూమి లేదు. కౌలుకు తీసుకుని సాగు చేసేవారికి భూయజమానులు రాతపూర్వకంగా ఎటువంటి పత్రాలు ఇవ్వకపోవడంతో ప్రస్తుతం వారు కూడా సొసైటీల్లో సభ్యత్వం కోల్పోవాల్సి వస్తోంది.

కేవైసీ లేని వారు ఔట్

సొసైటీ సభ్యులుగా కొనసాగుతూ కేవైసీ (నో యువర్ కస్టమర్) వివరాలు లేని వారిని కూడా సొసైటీ నుంచి సభ్యత్వం తొలగిస్తున్నారు. కేవలం రూ.10 షేరు ధనంతో కొనసాగుతున్న వారి కేవైసీ వివరాలు సొసైటీల్లో అందుబాటులో లేవు. ప్రస్తుతం సహకార సంఘాల కంప్యూటరీకరణ జరుగుతోంది. వచ్చేనెల 2 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుంది. ఈనేపథ్యంలో సొసైటీల్లో సభ్యుల వివరాలన్నీ కంప్యూటరీకరించాలంటే అందరి కేవైసీ వివరాలు అవసరం. అవి లేకపోతే కంప్యూటర్ డీసీటీ పోర్టల్‌లో వారి పేర్లు నమోదు కావు. ఈ నేపథ్యంలో సొసైటీల నుంచి వీరి సభ్యత్వాల తొలగింపునకు ఉత్తర్వులు ఇచ్చారు.

సొసైటీల్లో లావాదేవీలు నిర్వహించని వారిని గుర్తించి ఇన్‌యాక్టివ్ సభ్యులుగా భావించి వారిని కూడా తొలగించనున్నారు.

సభ్యుల ఆగ్రహం

సొసైటీల నుంచి సభ్యులను తొలగించే ప్రక్రియపై రైతులు మండిపడుతున్నారు. సభ్యులను తొలగించాలంటే మహాజనసభలో సరైన కారణాలతో తీర్మానం చేయాలి. అనంతరం సభ్యులకు వ్యతిరేకంగా నోటీసులు జారీచేసి వారి వివరణ తీసుకున్న తర్వాతే తొలగించాలి. అయితే ప్రస్తుతం కేవలం మహాజనసభ తీర్మానంతోనే వీరిని తొలగిస్తున్నారు. దీని వల్ల కోర్టు కేసులు వస్తాయని సొసైటీ సీఈవోలు భయపడుతూ సభ్యులను తొలగించేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈనేపథ్యంలో మహాజనసభలో వీరిని అనామత్తు కింద పెట్టి వారు కేవైసీ ఇచ్చి సభ్యునిగా కొనసాగించేందుకు అభ్యర్థిస్తే కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే నాటికి సొసైటీల్లో ఎంత మంది సభ్యులు మిగులుతారో వేచి చూడాల్సి ఉంది.


పింఛన్ అందుకుంటున్న దివ్యాంగురాలు (ఫైల్)

కోరిన చోటుకే పింఛన్

- ఆన్‌లైన్ ద్వారా బదిలీకి అవకాశం కల్పించిన ప్రభుత్వం
- తొలగనున్న లబ్ధిదారుల ఇబ్బందులు
- నూరుశాతం పంపిణీకి చర్యలు

ఒంగోలు నగరం, సెప్టెంబరు 9 : రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిపొందుతున్న వారు ఇక నుంచి కోరిన చోటనే పింఛన్ తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. జిల్లాలోని ఇతర మండలాలకు కానీ, రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కానీ మార్చుకుని తీసుకునే అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలోని చాలామంది పింఛన్‌దారులు సొంతూర్లకు దూరంగా ఉంటున్నారు. ప్రధానంగా వృద్ధులు తమ పిల్లల వద్ద ఉంటున్నారు. వీరు ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ సొమ్ము కోసం వ్యయప్రయాసలకోర్చి సొంత గ్రామాలకు వచ్చి తీసుకోవాల్సి వస్తోంది. ఇలా ప్రతినెలా రావాల్సి ఉండటంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది దూరం నుంచి రాలేక ఒక్కో నెలలో పింఛన్ సొమ్మును పొందలేకపోతున్నారు. ప్రభుత్వం మాత్రం నూటికి నూరుశాతం పింఛన్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ ఈ కారణాల వలన 99శాతం వరకే పింఛన్‌ల పంపిణీ జరుగుతోంది. అది నూటికి నూరుశాతం కావాలంటే లబ్ధిదారులు ఎక్కడ నివాసం ఉంటుంటే అక్కడే పింఛన్ ఇవ్వాల్సి ఉందని గుర్తించింది. అందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. దీంతో వచ్చేనెల నుంచి నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉంది.

సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి

లబ్ధిదారులు ముందుగా తాము పింఛన్ పొందుతున్న సచివాలయాన్ని సంప్రదించి అక్కడి నుంచి ఎక్కడికి పింఛన్‌ను మార్చుకోవాలనుకుంటున్నారో ఆ వివరాలను తెలియజేయాల్సి ఉంది. బదిలీ కోరుకునే గ్రామం, సచివాలయం పేరును నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్ నకలు, పింఛన్ పొందుతున్న ఐడీని చూపించాలి. పింఛన్ బదిలీ మండల పరిధిలో అయితే వెంటనే జరిగిపోతుంది. అదే ఇతర జిల్లాకు అయితే వెలుగు, డీఆర్‌డీఏ పీడీ లాగిన్ నుంచి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

జిల్లాలో 2,89,096 మంది పింఛన్‌దారులు

జిల్లాలో ప్రస్తుతం 2,89,096 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 1,57,116, వితంతువులు 67,913, దివ్యాంగులు 33,590, ఒంటరి మహిళలు 7,808, చర్మకారులు 5,339, డప్పు కళాకారులు 4,682, మత్స్యకారుల 2,530, చేనేత కార్మికులు 1,811, కల్లు గీత కార్మికులు 246, హిజ్రాలు 90, కళాకారులు 60, అభయహస్తం 4872, అమరావతి ల్యాండ్స్ పూర్ 5, సీకేడీయూ 186, సీకేడీయూ ప్రయివేట్ 336, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు 2,490, మాజీ సైనికులు 22మంది నెలవారీ ప్రభుత్వం నుంచి పింఛన్లు పొందుతున్నారు. వీరికి పింఛన్లు అందజేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతినెలా రూ.123కోట్లకుపైగా నిధులను విడుదల చేస్తోంది. వీరిలో అనేకమంది లబ్ధిదారులు ఇతరచోట్ల నివాసం ఉంటూ పింఛన్ సొమ్ము కోసమే సొంతూరికి వస్తున్నారు. ఇకపై లబ్ధిదారులు ఇలాంటి ఇబ్బందులు పడకుండా వారు ఉండే ప్రాంతానికే పింఛన్‌ను మార్చుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.



సాగర్ నీటిని విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

వరిసాగుకు సాగర్ నీటిని విడుదల చేయాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసనలో రైతుసంఘాల నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉన్నందున సాగర్ కుడి కాలువ కింద వరి పంట సాగు చేసుకొనేందుకు వెంటనే నీటిని విడుదల చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమానికి సంయుక్త కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ సాగర్‌కుడి కాలువ నుంచి జిల్లాకు రావాల్సిన వాటా నీరు కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుల్లోకి నీరుచేరిందని, కానీ కుడికాలువకు నీటిని విడుదల చేయకుండా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సాగర్‌లో 2005లో 540 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడు ప్రకాశం జిల్లాలో వరిసాగుకు నీరివ్వగా ప్రస్తుతం రిజర్వాయర్ పొంగి ప్రవహిస్తున్నా ఈ ఏడాది ఆరుతడి పంటలకు మాత్రమే నీరు ఇస్తామనడంతో రైతులు, పశుపోషకులు తీవ్ర మనో వేదనకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఆలోచించి జిల్లా వాటాగా రావాల్సిన సాగునీటిని తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శ్రీలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వడ్డె హనుమారెడ్డి, పమిడి వెంకట్రావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నీహెచ్ సుధాకరరావు, మండవ శ్రీనివాసరావు, దాసరి సుందరం, శిరిగిరి శ్రీనివాసరావు, ఎన్. శ్రీరాములు తదితరులు ఉన్నారు.

రేపు ఐటీఐ విద్యార్థులకు అప్రంటీస్ మేళా

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 9 : ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 11న స్థానిక ప్రభుత్వబాలుర ఐటీఐలో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ షిప్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎంవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈమేళాలో పలు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ పాసైన విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు శిక్షణ భృతి చెల్లిస్తారన్నారు. అప్రంటీస్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9703165456 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు పీఎంశ్రీ పాఠశాలలపై సమీక్ష

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 9 : జిల్లాలో పీఎంశ్రీ పథకం పేజ్-1, ఫేజ్-2 కింద ఎంపికైన 48 పాఠశాలలు, పాల్ ల్యాబ్ నిర్వహిస్తున్న 33 పాఠశాలల సమీక్షా సమావేశం మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంశ్రీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎంసి చైర్మన్, సంబంధిత మండల ఎంఈవో-2, పాల్‌ల్యాబ్ పాఠశాలల హెచ్‌ఎంలు సమావేశానికి హాజరు కావాలన్నారు. సమీక్షకు పూర్తి సమాచారంతో రావాలని డీఈవో కోరారు.

జైజై గణేశా.. బైబై గణేశా..

- తీరానికి తరలివస్తున్న గణనాథులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) సెప్టెంబరు 9: చవితి ముగిసి మూడోరోజు కావటంతో గణనాథులను నిమజ్జనం చేసేందుకు సోమవారం భక్తులు ఎక్కువ సంఖ్యలో తీరానికి తరలివచ్చారు. కొత్తపట్నం సముద్ర తీరానికి ఎక్కువగా నిమజ్జనం కోసం భక్తులు వినాయక విగ్రహాలను తీసుకువచ్చారు. నిమజ్జనం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు నుంచి అదనపు పోలీసులు తీరం వద్ద బందోబస్తులో పాల్గొన్నారు. ఉదయం నుంచే విగ్రహాలను నిమజ్జనం కోసం కొత్తపట్నం తీరానికి తరలించారు. ఒంగోలు నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకుచెందిన భక్తులు వందల సంఖ్యలో తీరానికి వచ్చారు. నిమజ్జనం అనంతరం సముద్రంలో స్నానాలు ఆచరించి స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన సమయంలో భక్తులు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. ఒంగోలు టూ టౌన్ సీఐ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ తీరంలో పర్యవేక్షణ జరిపారు.



మద్దిరాలపాడులో లడ్డు వేలం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

టీడీపీ ఆధ్వర్యంలో.. నిమజ్జన వేడుకలు

ఒంగోలు (కార్పొరేషన్) : గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని ఒంగోలులోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహ నిమజ్జన వేడుక సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో స్వామి వారి లడ్డు వేలం నిర్వహించగా పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ రూ. 1.29 లక్షలక పాడుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో ప్రతిమను ఊరేగించుకుంటూ కొత్తపట్నం సముద్రంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.



టీడీపీ కార్యాలయంలో నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడి వద్ద నేతల సందడి

రూ.28 వేలు పలికిన గణేశుని లడ్డు

నాగులుప్పలపాడు : వినాయకచవితి సందర్భంగా గ్రామాలలోని మండపాలలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలను సోమవారం నిమజ్జనానికి తరలించారు. మద్దిరాలపాడులో స్థానిక యువత ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గణపతి స్వామికి విశేష పూజలనంతరం అన్న సంతర్పణ చేశారు. స్వామి వారి లడ్డును వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన పూనాటి వెంకటేశ్వర్లు రూ.28 వేలకు దక్కించుకొన్నారు. అనంతరం బొజ్జ గణపయ్యను మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి కనపర్తి సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన 13 గణపతి విగ్రహాలను ఆయా విగ్రహాల కమిటీ సభ్యులు కనపర్తి, పెదగంజాం,మోటుపల్లి సముద్ర తీరాలలో నిమజ్జనం చేశారు. కనపర్తిలో రెండు విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాడు మెడకు తగిలి కిందపడి యువకుడి మృతి

సంతనూతలపాడు, సెప్టెంబరు 9: వినాయకుని మండపం వద్ద ఏర్పాటుచేసిన తాడు ప్రమాదవశాత్తు మెడకు తగిలి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మండలంలోని పేర్నమిట్టలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు పేర్నమిట్ట డౌన్‌లో సుబ్బయ్యహైస్కూల్‌కు వెళ్లే దారిలో వినాయకుని మండపం వద్ద విగ్రహం ఏర్పాటుచేసి వాహనాలు రాకుండా తాడు ఏర్పాటుచేశారు. ఈక్రమంలో అక్కడే ఉండే బుట్టి సందీప్ (20) అనే యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తూ చీకట్లో వినాయకుని మండపం వద్ద రోడ్డుపై ఏర్పాటుచేసిన తాడు మెడకు తగిలి ఒక్కసారి కింద పడ్డాడు. ఈప్రమాదంలో సందీప్ తలకు తీవ్రగాయాలతో స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే స్థానికులు , కుటుంబసభ్యులు దగ్గరలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే సందీప్ మృతిచెందినట్లు తెలిపారు.



కమిషనరుకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నేతలు

నగర సమస్యలు పరిష్కరించాలి

● కమిషనర్‌కు వామపక్ష నేతల వినతి

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 9 : నగరంలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సీపీఐ, సీపీఎం నాయకులు కమిషనరు కే. వెంకటేశ్వరరావును కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనరును కలిసి వినతి పత్రం అందజేశారు. పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు, దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని, కాలువల్లో పూడిక తీతత పనులు చేపట్టాలని కోరారు. అలాగే నగరంలోని బాలాజీ నగర్, మంగమూరు రోడ్ మర్రిచెట్టుకు కొంత దూరంలో శ్మశాన వాటిక ఏర్పాటుతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్‌డీ. సర్దార్, పీవీఆర్ చౌదరి, శ్రీరామ్ శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు జి. రమేష్, దామా శ్రీనివాసరావు, మారెళ్ల సుబ్బారావు, పలువురు పాల్గొన్నారు. అలాగే ఒంగోలు సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో కమిషనరుకు వినతి పత్రం అందజేశారు. పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని వారు అందులో కోరారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకొన్న మద్యం సీసాలతో ఎస్ఐ

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 9 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు. నాగులుప్పలపాడు శివారులోని ఓ రెస్టారెంట్ సమీపంలో అదే గ్రామానికి చెందిన పోలినేని శ్రీను సోమవారం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడిచేసి 25 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన

హెచ్ఐవీ పై అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చైల్డ్‌ఫండ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు.హెచ్‌ఎం సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కారాదన్నారు. చదువుపై శ్రద్ధ కలిగి ఉన్నతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ కృష్ణయ్య, చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ సూపర్‌వైజర్ కె.వినయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషక విలువలు

దొనకొండ, సెప్టెంబరు 9: చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, ఉలవలు, బొబ్బర్లతో ఆహారపదార్థాలు తయారుచేసుకొని తీసుకుంటే తల్లులు, పిల్లలకు మంచి పోషక విలువలు అందుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని పుచ్చకాయలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఏఎన్ఎం సంతోషకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీసీఏవోపై దాడి - కేసు నమోదు

నిందితుల కోసం గాలింపు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 9 : జిల్లా సహకార ఆడిట్ అధికారి(డీసీఏవో)గా పనిచేస్తున్న పోలిశెట్టి రాజశేఖర్‌పై ఆదివారం రాత్రి జరిగిన దాడికి సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు ఒంగోలు ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రాజశేఖర్‌పై దాడి చేసిన విషయం తెలుసుకున్న డీసీవో శ్రీనివాసరెడ్డి కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే జిల్లా ఎస్పీ దామోదర్‌కు ఫోన్ చేసి తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఎస్పీ ఒంగోలు ఒన్‌టౌన్, డీఎస్పీ, ఏఎస్పీలను అప్రమత్తం చేయడంతో వెంటనే వారు ఘటన జరిగిన ప్రదేశానికి, రిమ్స్‌కు వెళ్లి రాజశేఖర్‌తో మాట్లాడారు. దాడిచేసిన వారిని పట్టుకునేందుకు గాలిస్తున్నారు. కలెక్టర్ ఫోన్‌లో రాజశేఖర్‌ను పరామర్శించారు. మరో వైపు రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్, కమిషనర్ కార్యాలయ దృష్టికి కూడా తీసుకెళ్ళారు. డీసీవో, డీఎల్‌సీవో, డీసీఏవో కార్యాలయ సిబ్బంది రిమ్స్‌కు వెళ్లి రాజశేఖర్‌ను పరామర్శించారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

జిల్లా సహకార ఆడిట్ అధికారి, ఒంగోలు డిప్యూటీ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రాజశేఖర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బీసీహెచ్ మాలకొండయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కే వెంకటేశ్వర్లు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దాడిని వారు తీవ్రంగా ఖండించారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న డీసీఏవో రాజశేఖర్

డీసీఏవోపై దాడిలో కుట్ర కోణాన్ని ఛేదించాలి

జిల్లా సహకార అడిట్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్‌పై జరిగిన దాడిని ఏపీ సహకార గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా సహకారాధికారి బి. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. ఈదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దాడిలోని కుట్ర కోణాన్ని ఛేదించాలని ఆయన కోరారు. ఈ దాడి విషయంలో తమకు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.

హోంమంత్రిపై వైసీపీ ఎంపీపీ అసభ్య కామెంట్లు

మూడేళ్ల క్రితం సోషల్ మీడియాలో పోస్టు
ఇప్పుడు వైరల్.. చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్

పొన్నలూరు, సెప్టెంబరు 9 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీకి చెందిన పొన్నలూరు ఎంపీపీ కొండాబత్తిన మాధవ మూడేళ్ల క్రితం సోషల్ మీడియాలో పెట్టిన అసభ్య కామెంట్లు ఇప్పుడు వైరల్ అయ్యాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అనిత తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు 2021 డిసెంబర్ 27న రాష్ట్రంలో ఓ యువతిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ మీడియాతో మాట్లాడారు. అది ఫేస్‌బుక్ లైవ్ కూడా వచ్చింది. అందులో ఆమెను కించపరుస్తూ పొన్నలూరు ఎంపీపీ మాధవ అప్పట్లో అసభ్యకరమైన కామెంట్‌లు పెట్టారు. ఇప్పుడు అవి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఎంపీపీపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీపీ మాధవను వివరణ కోరగా.. తాను బాధ్యత గలిగిన పదవిలో ఉండి, తన సామాజికవర్గానికి చెందిన మహిళపై తప్పుగా కామెంట్ ఎందుకు పెడతానన్నారు. అప్పట్లో తన ఫోన్ నుంచి ఎవరైనా దాన్ని పెట్టి ఉంటారని, ఆ విషయం తనకు తెలియదన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు


గాయపడిన బ్రహ్మనాయుడు

టంగుటూరు, సెప్టెంబరు 9 : మోటారు సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారిలోని వల్లూరు ఫ్లైఓవర్‌పై సోమవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. జరుగుమల్లి మండలం చింతలపాలేనికి చెందిన సవలం బ్రహ్మనాయుడు, వెంకట్రావు మోటారు సైకిల్‌పై ఒంగోలు బయల్దేరారు. వల్లూరు ఫ్లైఓవర్‌పై రివర్స్‌లో వస్తున్న ఓ కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బ్రహ్మనాయుడు, వెంకట్రావుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దరూ ప్రస్తుతం ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 68 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఏఎస్పీ

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు9: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 68 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఫిర్యాదులను అదనపు ఎస్పీలు ఎస్‌వీశ్రీధర్‌రావు , కె.నాగేశ్వర రావు ఫిర్యాదులను పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదులలో చీటింగ్ కేసులు అధికంగా ఉన్నాయి. ఒంగోలులో ఆర్థోపెడిక్‌కు సంబంధించిన యంత్రాన్ని నెల్లూరుకు చెందిన వ్యక్తి లీజుకు తీసుకొని సక్రమంగా లీజు చెల్లించడం లేదని ఓ డాక్టర్ ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఒంగోలు కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని కృష్ణా జిల్లా చందర్లపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ. 1.5 లక్షలు నగదు తీసుకొని ఉద్యోగం ఇప్పించలేదని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. ఇలా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన 68 ఫిర్యాదులలో ఎక్కువ సంఖ్యలో చీటింగ్ కేసులు ఉన్నాయి. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు తాలుకా సీఐ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఖాతాలను అప్‌డేట్ చేయించుకోవాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి శ్రీనివాసరావు

కొండపి, సెప్టెంబరు 9 : కొండపి, చోడవరం సహకార పరపతి సంఘాల్లోని రైతులు తమ ఖాతాలను అప్‌డేట్ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాసరావు కోరారు. సోమవారం రెండు సంఘాల పరిధిలో వేర్వేరుగా మహాజన సభలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చేనెల 2 నాటికి సహకార సంఘాల్లోని అకౌంట్‌లన్నింటికీ ఆధార్, బయోమెట్రిక్ వేలి ముద్రలు అనుసంధానం కావాల్సి ఉందన్నారు. కొండపి సొసైటీలో 7,542 మంది, చోడవరం సొసైటీలో 8వేల మంది రైతులు ఖాతాలు కలిగి ఉన్నారన్నారు. వీరిలో 1,400 మంది అప్‌డేట్ చేయించుకున్నారన్నారు. మిగిలిన వారంతా కూడా చేయించుకొని సొసైటీల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. రెండుచోట్ల మహాసభలకు రైతులు స్వల్పంగా హాజరయ్యారు.

ఎస్సైను కలసిన టీడీపీ కూటమి నాయకులు



ఎస్సైకి బొకేను ఇస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

టంగుటూరు, సెప్టెంబరు 9 : టంగుటూరు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నాగమల్లేశ్వరరావును సోమవారం టీడీపీ కూటమి నాయకులు కలిశారు. ఆయనకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, పార్టీ జయవరం గ్రామ అధ్యక్షుడు యరమోసు సుధాకర్‌బాబు, ఉపాధ్యక్షుడు ఐనంపూడి భైరవ్‌కుమార్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.

'మావో'కు నివాళులు


నివాళులు అర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : పీడిత ప్రజల రాజ్య స్థాపనే ధ్యేయంగా పోరాడి చైనాలో సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పాటుచేసిన జన చైనా నేత, చైనా కమ్యూనిస్టు పార్టీ ఐరన్ మ్యాన్ మావోకు న్యూడెమోక్రసీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక డెమోక్రసీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చైనాలో విప్లవపార్టీ నాయకత్వంలో ప్రజాయుద్ధ పంథా ద్వారా సోషలిస్టు రాజ్యాన్ని 1949లో మావో సాధించారని తెలిపారు. మావో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మ, రాజశేఖర్, చొప్పర జాలన్న, ఆర్ మోహన్, మోజేష్, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.358

సంతనూతలపాడు, సెప్టెంబరు9: ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు గుర్వారెడ్డిపాలెం క్లస్టర్ నుంచి 1,294 పొగాకు బేళ్లు రాగా 1,147 బేళ్లు అమ్ముడైనట్లు, 147 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.358లు పలకగా, కనిష్ఠ ధర రూ.195 , సరాసరి ధర రూ.318.36 వచ్చినట్లు తెలిపారు. వేలంలో కొనుగోలు 17 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో విద్యుత్ పరికరాల దొంగ

కాంట్రాక్టర్ నిల్వ ఉంచిన సామగ్రిని చోరీ చేస్తుండగా పట్టుకున్న కూలీలు
ముఠాలోని ఐదుగురు పరారీ


పోలీసు స్టేషన్‌లో అప్పగించిన విద్యుత్ తీగలతో ఉన్న ఆటో

కొండపి, సెప్టెంబరు 9 : విద్యుత్ పరికరాలు చోరీ చేసే ముఠాలోని ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక ఆటోతోపాటు కొన్ని సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండలంలోని అనకర్లపూడిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. కొండపి పరిసర ప్రాంతాల్లో ఐదారు నెలలుగా విద్యుత్ పరికరాల దొంగతనాలు పెరిగాయి. ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి అందులోని రాగివైరుతోపాటు, పలు లైన్లలోని విద్యుత్ తీగలు, జగనన్న కాలనీల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లలోని రాగితీగలు చోరీకి గురయ్యాయి. శనివారం రాత్రి గోగినేనివారిపాలెం జగనన్న కాలనీకి వెళ్లే విద్యుత్ లైను తీగలను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. ఈనేపథ్యంలో అనకర్లపూడిలో విద్యుత్ కాంట్రాక్టర్ సామగ్రి నిల్వ చేసిన ఇంటి వద్దకు ఆదివారం రాత్రి దొంగలు చేరుకున్నారు. లోపలికి ప్రవేశించి సామగ్రిని ఆటోలోకి ఎత్తడం ప్రారంభించారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే కూలీలు దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. ముఠాలోని ఐదుగురు తప్పించుకొని పారిపోయారు. ఓ మహిళ పట్టుబడింది. ఆమె వద్ద కొన్ని సెల్‌ఫోన్లు కూడా దొరికాయి. అనంతరం ఆమెతోపాటు ఆటో, సెల్‌ఫోన్‌ను కూలీలు పోలీసులకు అప్పగించారు. ఈ ముఠా కనిగిరి ప్రాంతానికి చెందినదని, కొండపి ప్రాంతంలో వరుస దొంగతనాలు వీరి పనేనని అనుమానిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన గుజరాత్ బృందం


ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న గుజరాత్ అధికారుల బృందం

కొత్తపట్నం(ఒంగోలు నగరం) సెప్టెంబరు 9: మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలను గుజరాత్ రాష్ట్రానికి చెందిన బృందం సోమవారం పరిశీలించింది. మండలంలోని గమళ్ళపాలెం , రెడ్డిపాలెం ప్రాంతాల్లో పర్యటించి ప్రకృతివ్యవసాయ సాగును వారు పరిశీలించారు. కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయంలో రైతులు అవలంస్తున్న విధానాలను ఈ బృందం పరిశీలించింది. ఐదు రోజుల పాటు జిల్లాలోపర్యటించే ఈ బృందం తొలి రోజు కొత్తపట్నం మండలంలో పర్యటించారు. ముందుగా వీరు ఒంగోలులోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణిని కలిశారు. ఆమె జిల్లాలో జరిగే ప్రకృతి వ్యవసాయం గురించి ప్రజెంటేషన్ చేశారు. అ నంతరం కొత్తపట్నం మండలం గమళ్ళపాలెం గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ సాగును పరిశీలించారు. రైతు బలగాని బ్రహ్మయ్య డ్రాగన్ ఫ్రూట్ సాగులో ఆ వలంబిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తపట్నంలోని మల్లీశ్వరి ప్రకృతి వనరుల కేంద్రంలో సార్వత్రిక సూత్రాల చక్రంను ఈ బృందం పరిశీలించింది. బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, విత్తన గుళికలు, అగ్నాస్త్రం, చేప,బెల్లం ద్రావణం తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి హుమ్మన్, మండల వ్యవసాయ అధికారి మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ప్రకాశం పూర్వ డీపీవోపై విచారణ చేపట్టండి

బాపట్ల, ప్రకాశం కలెక్టర్‌లకు పలువురు వినతి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగులు

పర్చూరు, సెప్టెంబరు 9 : ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారి అక్రమార్జనే ధ్యేయంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి భారీగా దోచుకున్నారని, ప్రకాశం పూర్వ డీపీవో నారాయణరెడ్డిపై విచారణ చేపట్టాలని ప్రకాశం, బాపట్ల కలెక్టర్‌లకు పర్చూరు నియోజకవర్గానికి చెందిన దేవతోటి నాగరాజు, రమేష్, రాజేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. పూర్వ డీపీవో నారాయణరెడ్డి అక్రమ సంపాదనే లక్ష్యంగా ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచారన్నారు. చిన్నగంజాం మండలం కడవకుదురు సామాన్య కుటుంబం నుంచి వచ్చి నేడు కోట్లు అర్జించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల చిట్టాలను చేతిలో పెట్టుకొని, వారిని బెదిరించి అక్రమంగా దండుకున్నారన్నారు. అక్రమార్కులతో సైతం చేతులు కలిపి ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారన్నారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతల అండతో దందా కొనసాగించారని పేర్కొన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలలో ఆయా గ్రామాల అధికారుల బదిలీల పేరుతో పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. చినగంజాం మండల పరిధిలో 400 రోడ్లు నిర్మించకుండా నిర్మించినట్లు కోట్లలో బిల్లులు డ్రా చేసి వర్షాలకు కొట్టుకుపోయినట్లు రికార్డుల్లో రాసినట్లు వారు ఆరోపించారు. తక్షణమే డీపీవోను విచారించి, చర్యల తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తల్లి చెంతకు చంటిబిడ్డ


చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ పీడీ హేన సుజన్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 9 : నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో దొరికిన మూడు నెలల పసికందును సోమవారం ఐసీడీఎస్ అధికారులు తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు మూడు నెలల పసికందును బస్టాండ్‌లో వదిలి వెళ్లారు. సాయంత్రం వరకు చూసినా ఆ బిడ్డ కోసం ఎవరూ రాకపోవడంతో సమాచారం అందుకున్న జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్ పోలీసులకు సమాచారం అందజేసి ఆ బిడ్డను శిశు గృహకు తరలించారు. ఈ క్రమంలో సోమవారం నెల్లూరుకు వచ్చిన పసికందు తల్లిదండ్రులు ఉలవపాడు మండలం కరేడుకు చెందిన ఈగ రమాదేవి, భర్త సుధాకర్‌లు తమ బిడ్డ కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆరా తీశారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది వారిని విచారించి ఐసీడీఎస్ అధికారుల వద్దకు పంపారు. వారిని ఐసీడీఎస్ అధికారులు విచారించగా తన బిడ్డను ఆర్టీసీ బస్టాండ్‌లో బల్లపై పడుకోబెట్టి తాను తలతిరిగి పడిపోయనని, స్పృహ వచ్చాక బిడ్డ కనిపించకపోవడంతో ఆత్మకూరులోని బంధువుల ఇంటికి వెళ్లానన్నారు. టీవీల్లో వచ్చిన వార్తలను చూసిన బంధువులు తన బిడ్డ నెల్లూరులో ఉందని చెప్పడంతో ఇక్కడికి వచ్చాననడంతో వారు శిశు గృహలో ఉన్న బిడ్డను చూపించగా వారి బిడ్డగా గుర్తించారు. దీంతో ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ వారికి పసికందును అప్పగించారు. సిబ్బంది సమత, పెంచల లక్ష్మి పాల్గొన్నారు.

కాలువలోకి దిగి డిగ్రీ విద్యార్థి మృతి

గవినివారిపాలెంవాసిగా గుర్తింపు
పిడుగురాళ్ల వద్ద ఘటన.. నేడు స్వగ్రామానికి మృతదేహం


బాలు (ఫైల్)

చీరాలటౌన్, సెప్టెంబర్ 9 : కుటుంబంతో కలిసి మొక్కుబడి చెల్లించుకునేందుకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి గుంటూరు జిల్లా పిడుగురాళ్ల వద్ద మృత్యువాత పడ్డాడు. అందిన వివరాల ప్రకారం.. చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన మిండా వెంకటరావు, గంగమ్మ దంపతులకు బాలు(19) చిన్నకుమారుడు. పెద్ద కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. వీరంతా పిడుగురాళ్ల వద్ద అడవి ఉప్పలపాలెం జిల్లెళ్ల మూడి అమ్మవారికి మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం ఉదయం వెళ్లారు. కార్యక్రమాలు ముగిశాక అక్కడున్న కాలువలో మునిగేందుకు కుటుంబ సభ్యులు కొంతమంది దిగారు. ప్రమాదవశాత్తు బాలు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. పోలీసుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 10 కిలో మీటర్ల దూరంలోని లాకుల వద్ద సోమవారం సాయంత్రం మృతదేహం పైకి తేలింది. మృతదేహాన్ని ఒడ్డుకు లాగేందుకు తాడు కట్టడానికి వెళ్లిన వ్యక్తి పట్టుతప్పి లాకుల కిందికు వెళ్లిపోయారు. ఆ సమయంలో ఒడ్డున ఉన్న అందరూ కంగారు పడ్డారు. వెంటనే ఆయన కనిపించడంతో ఊపిరిపీల్చుకున్నారు. తాడు సహాయంతో బాలు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. నేడు స్వగ్రామానికి బాలు మృతదేహం రానుంది

వ్యక్తి ఆత్మహత్య

చినగంజాం, సెప్టెంబరు 9 : మండలంలోని పెద్దపల్లెపాలేనికి చెందిన దండుప్రోలు సోమయ్య(31) ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సోమయ్యకు సంవత్సరం కిందట సింగరాయకొండ మండలం కరేడు గ్రామానికి చెందిన జ్యోతితో వివాహమైంది. వీరికి 15రోజుల బాబు ఉన్నాడు. వివాహానికి ముందు సోమయ్యకు అప్పులున్నాయి. చేసిన అప్పులు తీరకపోవడంతో మద్యానికి బానిసయ్యారు. కొంతకాలం బాపట్ల శ్రీరామ్ చిట్స్‌లో అతడు పనిచేశారు. 20 రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లారు. కుటుంబసభ్యులు ఉద్యోగం కోసం బయటకు వెళ్లి ఉంటాడని భావించారు. గ్రామానికి సమీపంలోని సరుగుడు తోటలో ఉరి వేసుకొని మృతి చెంది ఉండడం గొర్రెల కాపరులు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. అతని చేతి మీద భార్య పేరు జ్యోతి అని ఉండడంతో సోమయ్యగా కుటుంబసభ్యులు గుర్తించారు. అతని తమ్ముడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ అధికారి పి.పేరిలింగేశ్వరావు తెలిపారు. పోలీసులు స్థలాన్ని పరిశీలించారు.

కిడ్నాప్ చేసి బెదిరించారంటూ ఫిర్యాదు

బాపట్ల,సెప్టెంబరు 9 : చినగంజామండలం సోపిరాల గ్రామానికి చెందిన తండ్రి కూతుళ్ళను పోలీసుల పేరు చెప్పి కిడ్నాప్ చేయటమే కాకుండా తమకు సంబంధించిన భూములు, ఇళ్ళు రాయించుకుంటున్నట్లు ఖాళీ స్టాంప్‌లపై సంతకాలు చేయించుకున్నారని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే చినగంజాం మండల సోపిరాల గ్రామంలో నివాసం ఉంటున్న దేవరకొండ సుబ్బారావు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 6వ తేది మధ్యాహ్నం ఇంట్లో తనకుమార్తెలు గాయత్రి, మౌనికలతో కలిసి భోజనం చేస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు వచ్చి చినగంజాం ఎస్సై రమ్మన్నారంటూ పిలిచి ముగ్గురిని కారులో ఎక్కించుకొని తీసుకెళ్ళారు. తీరా చినగంజాం స్టేషన్‌కు తీసుకెళ్ళకుండా చిలకలూరిపేట రూరల్ పోలీసుస్టేషన్ వెనుక ఓ పాడుపడిన ఇంట్లో పెట్టి కులం పేరుతో దూషించి అత్యాచారం చేస్తామని బెదిరించి చంపితే నీకు దిక్కెవరంటూ వారితో బలవంతంగా ఖాళీస్టాంప్‌లు, ప్రామసరీనోట్‌లపై సంతకాలు చేయించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిలో కాని స్టేబుళ్ళమని చెప్పుకుంటున్న మధు, ఎం.సుబ్రహ్మణ్యం అనేవారు వైట్ పేపర్లపై కూడా సంతకాలు పెట్టించుకున్నారని వారు పేర్కొన్నారు. ఎవరికైన చెబితే పరిస్థితి దారుణంగా ఉంటుందని పెట్రోల్ పోసి తగలబెడుతామని హెచ్చరించి వదిలిపెట్టినట్లు వారు పేర్కొన్నారు. కావున తమను నిర్బంధించి బెదిరించిన మధు, సుబ్రహ్మణ్యం, ప్రతాప్, రంజిత్‌లతోపాటు మిగిలినవారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని సంతకాలు చేయించుకున్న పత్రాలు తిరిగి ఇప్పించాలని ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సోమవారం ఎస్పీ తుషార్ డూడిని వారు కోరారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారదేవికలో కూడా కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు.

అక్రమ తవ్వకాలను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక


అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

చీరాలటౌన్, సెప్టెంబరు 9 : ప్రభుత్వ నిబంధనలను విస్మరించి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ, మైనింగ్ అధికారులు హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ చీరాల పరిధిలోని కీర్తివారిపాలెం - పెర్లవారిపాలెం మధ్యగల ఫారెస్ట్ భూముల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ జరిగిన తవ్వకాలను ఫొటోలు, వీడియోల రూపంలో ఆధారాలను సేకరించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు. పరిశీలనలో మైనింగ్ ఆర్ఐ కనపర్తి రాజు, రెవెన్యూ ఆర్ఐ శేఖర్, సిబ్బంది ఉన్నారు.

20న జిల్లాస్థాయి యువజనోత్సవాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : ఒంగోలులో ఈనెల 20వతేదీన జిల్లాస్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం యువజనోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకు ముందు సెట్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు జిల్లా స్థాయి యువజనోత్సవాల సందర్భంగా జానపదనృత్యం, సంగీత, వైజ్ఞానిక జీవన నైపుణ్యాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 15నుంచి 29 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్న యువతీ, యువకులు ఈ పోటీలో అధికంగా పాల్గొనే విధంగా చూడాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 18వతేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే ఈ పోటీలకు అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు రూ.4లక్షల విరాళం


సీఎంకు విరాళం అందిస్తున్న టీఎస్‌యూఎన్ నేతలు

ఒంగోలు(విద్య),సెప్టెంబరు 9 : విజయవాడ వరద బాధితులకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా రూ.4లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సోమవారం అందజేశారు. వరద బాధితులను ఆదుకొనేందుకు ఈ విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ ఉపాధ్యాయులు కేవలం బోధనకే పరిమితం కాకుడా సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మన్నం శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు, చెరుకూరి పూర్ణచంద్రరావు, కే దాస్, తల్లపనేని రామారావు, కె. వెంకట్రావు, మోహన్‌రావు, వై. ఆంజనేయులు, రవీంద్ర, కొమ్మినారాయణ, ఆర్. శ్రీనివాస్, ఎం.రామలింగయ్య, వీరయ్య తదితరులు ఉన్నారు.

విరాళాల సేకరణ

సంతనూతలపాడు, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు రూ. 10,801 విరాళాలను సేకరించారు. సేకరించిన విరాళాలను వరద బాధితుల సహాయనిధికి పంపినట్లు తెలిపారు.

ముగిసిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల బదిలీలు


కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : జిల్లా పంచాయతీ వింగ్‌లో పనిచేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ముగిసింది. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపుహాలులో జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీల కోసం 206 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ దరఖాస్తులకు అనుగుణంగా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు.సీనియారిటి ప్రకారం ఈ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ బదిలీల కౌన్సెలింగ్ జిల్లా నలుమూలల నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జి. రామకృష్ణకిషోర్ తదితరులు ఉన్నారు.

నేడు వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీకి కౌన్సెలింగ్

ఒంగోలు నగరం, సెప్టెంబరు 9: జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు బదిలీల కౌన్సెలింగ్‌ను ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బదిలీల కోసం మొత్తం 312 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒంగోలులోని డ్వామా కార్యాలయం సమావేశం హాలులో ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు తగిన సమాచారంతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రమాదవశాత్తు కూలి మృతి

● వెలిగొండ ప్రాజెక్టు డ్యాం పనులు చేస్తుండగా ఘటన

మార్కాపురం, సెప్టెంబరు 9: వెలిగొండ ప్రాజెక్టు డ్యామ్ వద్ద జరుగుతున్న తాగు నీటి పథకం పనులు చేస్తున్న ఓ కూలీ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు కథనం మేరకు స్థానిక గొట్టిపడియ డ్యామ్ వద్ద నియోజకవర్గానికి నీటిని అందించే తాగునీటి పథకానికి సంబంధించిన ఇన్‌టెక్ వెల్ వద్ద పనులు చేస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన రధియా వహేన్(26) ఇన్‌టెక్ వెల్‌పై నుంచి కాలుజారి కిందపడిపోయాడు. దీంతో ఘటనా స్థలంలోనే అతను మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమరావు తెలిపారు.

మినీ లారీ ఢీకొని వ్యక్తి మృతి

కంభం, సెప్టెంబరు 9 : మినీలారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కందులాపురం కూడలిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకొంది. ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం, బేస్తవారపేట మండలం గొట్లమిల్లు గ్రామానికి చెందిన గొట్టం అబ్రహం (59) కందులాపురం కూడలిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం విధులకు వెళుతూ, కందులాపురంలో రోడ్డుదాటుతున్నాడు. గుంటూరు వైపు మిర్చి లోడుతో వెళుతున్న మినీలారీ అబ్రహంను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 9: బాల్యవివాహాలు నేరమని సీడీపీవో సుశీలాదేవి అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య కాలనీలోని మున్సిపల్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బాల్యవివాహాలు, రక్త హీనత, పౌష్టికాహారంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుశీలాదేవి మాట్లాడుతూ.. చిన్నవయస్సులో వివాహాలు చేస్తే అనేక అనార్థాలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు నేరం అన్నారు. బాలికలు, మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని చౌకగా లభించే ఆకుకూరలు, కూరగాయల్లో అవి లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, సూపర్‌వైజర్లు రవికుమారి, బుజ్జి, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ ధ్వంసం

తర్లుపాడు, సెప్టెంబరు 9: మండలంలోని జగన్నాథపురం ఎస్సీ కాలనీలో ఓ సెల్ కంపెనీ కేబుల్ వేసేందుకు తీస్తున్న గుంతలో నీటి పైపులు ధ్వంసం అయ్యాయి. దీంతో ఎస్సీకాలనీ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. కలుజువ్వలపాడు నుంచి తుమ్మలచెరువు వరకు నెట్ కేబుల్ కోసం జేసీబీలతో గాడి తీస్తున్నారు. ఈ గాడిలో జగన్నాథపురంలోని ఎస్సీ కాలనీ వాసులకు నీటి సరఫరా చేసే పైప్‌లైన్ ఉంది. అవి ధ్వంసం అయ్యాయి. దీంతో ఆ కాలనీ వాసులకు నీటి కష్టాలు మొదలవుతున్నాయి. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా పగిలిన పైప్‌లైన్‌ను సెల్‌నెట్‌వర్క్ కంపెనీ కాంట్రాక్టర్‌తో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఐకాన్ అవార్డును అందుకున్న వేల్పుల

పొదిలి, సెప్టెంబరు 9 : పొదిలి గీతాంజలి హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు వేల్పుల వెంకట్ పాన్‌ఇండియా ఐకాన్ అవార్డును ఆదివారం గుంటూరులో అందుకున్నారు. ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కెన్నడి నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ అవార్డులను భారతదేశంలో 1200ల మందికి అందజేశారు. వీరిలో పొదిలి ఉపాధ్యాయుడికి అవార్డు దక్కడం శుభపరిణామమని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. టీచర్స్ డే సందర్భంగా వివిధ పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి కొంతమందిని సెలెక్ట్ చేసి ఈ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సైకాలజిస్ట్ సుబ్బారావు, అనీల్‌కుమార్, రామానాథం పాల్గొన్నారు. వెంకట్‌ను టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న వెంకట్

వైభవంగా వినాయక నిమజ్జనం

గిద్దలూరుటౌన్, సెప్టెంబరు 9 : వినాయక చవితి నుంచి మూడురోజులుగా పూజలు అందుకున్న గణనాథులను సోమవారం సాయంత్రం నిమజ్జనం చేశారు. పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన మండపాలలో కొలువుదీరిన గణనాథులకు విశేష పూజలు చేశారు. సోమవారం సాయంత్రం కే.ఎస్.పల్లె సమీపంలోని సగిలేరు నదిలో నిమజ్జనం చేశారు. అర్బన్ సీఐ కె.సురేష్ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుండ్లకమ్మ వాగు వద్ద కోలాహలం

తర్లుపాడు : మండలంలో వినాయకచవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు మూడోరోజు నిమజ్జనానికి తరలించారు. బొడిచర్ల వద్ద ఉన్న గుండ్ల కమ్మ వాగులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎస్ఐ పి.రాజ్‌కుమార్ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఉట్టికొట్టే కార్యక్రమం

గిద్దలూరు : గణేష్ నవరాత్రుల్లో భాగంగా నవవస్త్ర గణపతి వద్ద, వాసవి అపార్ట్‌మెంట్‌లో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా సగిలేరులోని కొన్ని ప్రాంతాల వద్ద నీటిప్రవాహం ఉండడంతో పోలీసులు ఆ ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశారు. మిగిలిన ప్రాంతాల్లో కొనసాగింది.

పొదిలి : వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం సోమవారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. స్వామివారికి సోమవారం ప్రత్యేకపూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన కార్యక్రమంతో ఏర్పాటు చేసిన డీజేలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లడ్డూ పాటలు నిర్వహించి లడ్డు దక్కించుకున్న వారిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి అభినందించారు.

కొమరోలు : మండల కేంద్రంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వినాయకుని ప్రతిమలను గ్రామోత్సవం నిర్వహించి చివరగా గణనాథుల వాహనాలు దేవాలయం వద్దకు వరుసగా వచ్చి అక్కడి నుంచి పెద్దచెరువుకు నిమజ్జనానికి తరలించారు. యువత ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు. మండలంలోని మూలపల్లి గ్రామంలోని వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని రూ.66వేలకు దనిరెడ్డి కొండారెడ్డి దక్కించుకున్నారు. తాతిరెడ్డిపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుని లడ్డుప్రసాదాన్ని ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి రాజు రూ.43,100లకు, స్థానిక వరసిద్ధి వినాయకుని దేవాలయంలో లడ్డూప్రసాదాన్ని కొమరోలు గ్రామానికి చెందిన నాగార్జున రూ.25 వేలకు, స్థానిక సిమెంటుకొట్టు వెంకటరెడ్డి వినాయకుని లడ్డు ప్రసాదాన్ని సముద్రాల వెంకటేశ్వర్లు రూ.25వేలకు, స్థానిక శివాజీనగర్‌లో రూ.9500లకు జాజం నీలకంఠం, గోపానిపల్లి గ్రామంలో వగ్రా.ఈశ్వరమ్మ రూ.18 వేలకు, మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో రూ.10,500లకు కదం వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. గణేశుని భక్తిపాటలతో యువత కేరింతలతో ఉల్లాసంగా నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. స్థానిక మఠంబజారులోని శ్రీవీరబ్రంహ్మంగారి మఠంలో వినాయకుని తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలను ధర్మకర్త వెంకటరమణ ఘనంగా నిర్వహించారు.


పొదిలిలో వినాయకుడికి గ్రామోత్సవం


దోర్నాలలో నిమజ్జనానికి గణనాథుడు, మూలపల్లెలో లడ్డూ దక్కించుకున్న కొండారెడ్డి

వరద బాధితుల కోసం విరాళాలు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ద్వారా సహాయనిధికి అందజేత

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 9 : ప్రకృతి విలయ తాండానికి గురైన విజయవాడ వరద బాధితులకు గిద్దలూరు పట్టణానికి చెందిన పలువురు అండగా నిలిచారు. పట్టణానికి చెందిన జీవనజ్యోతి కళాశాల యాజమాన్యం రూ.1,30,600 విలువైన చెక్కును స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ కంకర శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది, డిగ్రీ, ఇంటర్మీడియట్, ఒకేషన్ కళాశాలల విద్యార్థులు ముందుకు వచ్చి విరాళాలు సేకరించి, ఆ నగదును చెక్కు రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అమ్మ ఫౌండేషన్ రూ.85వేల విరాళాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి సంస్థ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు అందజేశారు. మానవతా దృక్పథంతో దాతలు సహృదయంతో ముందుకు వచ్చి బాధితులకు విరాళాన్ని అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నా రు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు బూనబోయిన చంద్రశేఖర్, పందనబోయిన భూపాల్, ఓబులరెడ్డి, పుల్లయ్య, శేఖర్, తిరుపతయ్య, అరవింద్, బాలరాజు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు విరాళం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అన్నా క్యాంటీన్‌కు బేస్తవారపేట మండలం పందిళ్లపల్లె గ్రామానికి చెందిన కర్నాటి వెంకటనారాయణ రెడ్డి అన్నాక్యాంటీన్‌కు రూ.6వేల విరాళాన్ని సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో ఆవుల శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరెడ్డి, పీరారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించాలి

గిద్దలూరు టౌన్ : గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యతాప్రమాణాలు పాటించాలన్నారు. గ్రామాల్లో దీర్ఘకాలికంగా నెలకొన్న పనులను పూర్తి చేయాలని, తాగునీటి సమస్యలు, రహదారుల సమస్యలుంటే వాటిని పరిష్కరించాలని అన్నారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.


విరాళం అందజేస్తున్న జీవనజ్యోతి కళాశాల యాజమాన్యం

అవీ..ఇవీ..

పాఠశాల అభివృద్ధికి చేయూత

తర్లుపాడు, సెప్టెంబరు 9: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వపు విద్యార్థులు చేయూతనందిస్తున్నారు. పాఠశాలలో డైమండ్ జూబ్లీ హిల్స్ ప్రోగ్రాం త్వరలో నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీకి పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పూనుకున్నారు. 1991-92లో చదువుకున్న పూర్వపు విద్యార్థులు పాఠశాల ఆవరణ మొత్తం మెటల్ తోలి టైల్స్ వేయిస్తున్నట్లు తెలిపారు. మరికొంత మంది విద్యార్థుల కూడా పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయులు సుధాకర్ బాబు తెలిపారు. దసరా సెలవుల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకునేందుకు సన్నహాలు చేస్తున్నట్లు సుధాకర్ బాబు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్వపు విద్యార్థులందరూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

గర్భిణులకు అన్నదానం

గిద్దలూరు, సెప్టెంబరు 9: పట్టణంలోని వివేకానంద కళాశాలకు చెందిన 1983-85-88 ఇంటర్, డిగ్రీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు, పరీక్షల కోసం వచ్చిన 150 మంది గర్భిణులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు, డాక్టర్ ఖాదర్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు తులసిబాబు, కాశయ్య, సుబ్బారావు, సుబ్బరాయుడు, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 9: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని అపుస్మా ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డులు అందుకున్న వాసవి విద్యానికేతన్ ఉపాధ్యాయులను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా వాసవి విద్యానికేతన్ డైరెక్టర్ ప్రిన్సిపల్ కందెపు రంగయ్య మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయినులు జాస్మిన్ లింకన్, అపర్ణ, రహిమున్నీసాలు ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, ఆయన సతీమణి నాగసత్యలత, జిల్లా విద్యాశాధికారి డి.సుభద్రల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో వీరిని సన్మానించామని ప్రతి ఒక్కరూ ఆదర్శ ఉపాధ్యాయులుగా ఎదగాలన్నారు.

బాపట్ల జిల్లా అధికారిగా డాక్టర్ వేణుగోపాల్

గిద్దలూరు, సెప్టెంబరు 9 : గిద్దలూరుకు చెందిన డాక్టర్ బి.వేణుగోపాల్ బాపట్ల జిల్లా పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారిగా నియమితులయ్యారు. నియోజకవర్గంలోని పలు పశువైద్యశాలల్లో వైద్యునిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం బేస్తవారపేట పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రమోషన్లలో భాగంగా డాక్టర్ వేణుగోపాల్ సేవలను, సీనియారిటీని గుర్తించిన కూటమి ప్రభుత్వం జిల్లా అధికారిగా ప్రమోషన్ ఇస్తూ బాపట్ల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా నియమించారు.

వరద బాధితులకు విరాళాలు సేకరణ

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), సెప్టెంబరు 9: విజయవాడలో వరద బాధితుల సహాయం కోసం ఎర్రగొండపాలెంలో ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి విరళాలు సేకరించారు. సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు వెంకట్రావు, నాగేంద్రలు ఈ విరాళ సేకరణలో పాల్గొన్నారు.

పొదిలి : విజయవాడ వరద బాధితుల కోసం మల్లవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు రూ.10వేల విరాళం సేకరించారు. వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాలను ఎంఈవో శ్రీనివాసరెడ్డికి సోమ వారం కార్యాలయంలో అందజేశారు. ఈ విదార్థులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు సహాయం చేయాలని ఎంఈవో పిలుపునిచ్చారు. విరాళాలు అందజేసిన వారిలో మేఘన, జోయయ, జ్యోతి, జెస్సీ, శివపార్వతి, హెప్సీ, హేమ, అక్షర, శివక్రిష్ణ, గౌతమ్, నరసింహాలు ఉన్నారు. వీరికి ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, రమణారెడ్డి, శ్రీనివాసులు విద్యార్థుల వెంట ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగ చోరీ


దొంగలు పగులకొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

దొనకొండ, సెప్టెంబరు 9: మండలంలోని వెంకటాపురం గ్రామంలో వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలోని మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం రాత్రి పగులకొట్టి చోరీ చేశారు. అందిన సమాచారం మేరకు.. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ నిమిత్తం వెంకటాపురం గ్రామంలో రహదారి పక్కనే 50 ప్లాట్లతో జగనన్న కాలనీ ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. గృహాలకు కరెంట్ సరఫరా నిమిత్తం మూడు 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో కేవలం ఒక కుటుంబం మాత్రమే ఇల్లు నిర్మించుకొని ఉంటున్నారు. ఆదివారం రాత్రి దొంగలు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి లోపలున్న రాగితీగను తీసుకెళ్లారు. జగనన్న కాలనీలో వేసిన బోరులో నీరు సమృద్ధిగా ఉంది. దీంతో గ్రామస్థులకు తాగేందుకు, ఉపయోగానికి ఈ బోరు నుంచి ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుపుతున్నారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరిగి కరెంట్ సరఫరా నిలిచిపోవటంతో నీటి సమస్యపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరిగిన విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ నాగూర్‌వలి సంఘటనాస్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ మాయం

కురిచేడు, సెప్టెంబరు 9: కురిచేడు మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ మాయమైంది. అర్ధరాత్రి సమయంలో అక్రమంగా తలరిస్తున్న లారీని కొంతమంది అడ్డుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులెవరూ అందుబాటులోకి రాకపోవడంతో సదరు అడ్డగించిన వారే లారీని ఓపెట్రోల్ బంకులో ఉంచి అధికారులకు తెలియజేశారు. అధికారులు వచ్చేసరికి సదరు లారీ మాయమైంది. కురిచేడు మండలం కల్లూరు గ్రామం వద్ద ఆదివారం రాత్రి 60 బస్తాల రేషన్ బియ్యంతో ఓ మినీ లారీ (ఏపీ39యుఎల్4460) బయలు దేరింది. గ్రామస్థులు పట్టుకొని పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారెవరూ అందుబాటులో లేకపోవడంతో పట్టుకున్నవారు పదరు లారీని ఓ పెట్రోల్ బంకు వద్ద ఉంచి నిఘా పెట్టారు. సోమవారం తెల్లవారిన తరువాత లారీపై నిఘా పెట్టిన వారి కళ్ళుకప్పి సదరు అక్రమ రేషన్ బియ్యం ఉన్న లారీని డ్రైవర్ మాయం చేశాడు. ఈవిషయం వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీస్ ఉన్నతాధికారులకు తెలియజేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

వెలిగండ్ల, సెప్టెంబరు 9: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన మండలంలోని రామలింగాపురం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. గుమ్మలకర్ర గ్రామానికి చెందిన లాజర్, జార్జ్‌లు ఒకే వాహనంపై వెలిగండ్లకు వస్తున్నారు. ఈసమయంలో మరొకకు వెలిగండ్ల నుంచి వెళుతూ ఎదురెదురుగా ఢీకొన్నారు. తీవ్రగాయాలైన ముగ్గురు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. విధి నిర్వహణలో అటువైపు వెళుతున్న ఎస్సై ఆరోహన్, ఏఎస్సై జిలానీలు క్షతగాత్రులను 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కస్తూర్బా పాఠశాలలో కలకలం

దర్శి, సెప్టెంబరు 9: స్థానిక కస్తూర్బా పాఠశాలలోకి రాత్రిపూట గుర్తుతెలియని ఆగంతకుడు చొరబడుతున్నాడన్న వదంతులు కలకలం లేపుతున్నాయి. కొద్దిరోజుల క్రితం ఒక వ్యక్తి గోడదూకి లోపలకు రావడంతో విద్యార్థినులు బయపడి తలుపులు వేసుకున్నట్లు చెబుతున్నారు. విద్యార్థినుల సమాచారం మేరకు పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్శి ఎస్సై మురళీ ఆధ్వర్యంలో పోలీసులు నిరంతరం కస్తూర్బా పాఠశాలపై నిఘా పెట్టి పరిశీలిస్తున్నారు. లోపలకు ఆగంతకుడు ప్రవేశించాడా, లేదా అనే విషయాన్ని నమూనాల కోసం గోడలపై వేలిముద్రలు సేకరించినట్లు తెలిసింది. ఈవిషయమై ఎస్సై మురళీని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, కస్తూర్బా పాఠశాల సిబ్బంది ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనన్నారు. దీనిపై నిఘా పెట్టి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దేకనకొండలో ఘర్షణ.. 6గురికి గాయాలు

కురిచేడు, సెప్టెంబరు 9: కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీకి చెందినవారు వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించేక్రమంలో రోడ్డుకు అడ్డుగా ట్రాక్టర్‌ను పెట్టారు. ఆసమయంలో అదేమార్గంలో వైసీపీకి చెందిన వ్యక్తులు ట్రాక్టర్‌లో వస్తున్నారు. రోడ్డుగా అడ్డుగా ట్రాక్టర్ ఉండటంతో వైసీపీ వర్గానికి చెందినవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగి రాళ్ళు రువ్వుకోగా ఆరుగురికి గాయాలు అయ్యాయి. త్రిపురాంతకం సీఐ సుబ్బారావు, కురిచేడు ఎస్ఐ శివలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి సర్దిచెప్పారు. వినాయక నిమజ్జనం అయ్యే వరకు అక్కడే ఉన్నారు.

శిథిలావస్థలో 'రక్షిత' ట్యాంకులు

- ఎప్పుడు కూలుతాయోనని ప్రజల ఆందోళన
- పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరిన పసుపుగల్లులోని రక్షిత మంచి నీటి ట్యాంక్


శిథిలావస్థకు చేరిన పూరిమెట్లలోని ట్యాంక్

ముండ్లమూరు, సెప్టెంబరు 9: మండలంలోని పలు గ్రామాల్లో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయో, ఏరూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టించుకోవాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం మండలంలోని పసుపుగల్లు, శంకరాపురం, నూజెండ్లపల్లి, పూరిమెట్ల, బొప్పూడివారిపాలెం, ఈదర తదితర గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఇవి జనావాసాల మధ్య ఉండటంతో పాటు ట్యాంకు సువ్వలు ఊడిపోయి పెచ్చులు కిందపడి పోతున్నాయి. దీంతో సమీపంలోని నివాస ప్రాంత ప్రజలు భయపడిపోతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు సం బంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

మండలంలోని శంకరాపురంలో గ్రామ నడిబొడ్డున నివాస ప్రాంతాల మధ్యలో ట్యాంక్ ఉంది. అలాగే, పసుపుగల్లు, పూరిమెట్లలో నివాస ప్రాంతాల మధ్య ట్యాంకులు ఉన్నాయి. గతంలో మండల కేంద్రమైన ముండ్లమూరు, పెదఉల్లగల్లు, వేముల గ్రామాల్లో ట్యాంకులు శిథిలావస్థకుచేరి పడిపోవటంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితుల కోసం భారీగా విరాళాల సేకరణ


దర్శి: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న కాకతీయ కమ్మ సేవా సంఘం నాయకులు


పామూరు: లోకేష్‌కు రూ.10 లక్షల చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ పీవీ శేషయ్య

దర్శి, సెప్టెంబరు 9: వరద బాధితుల సహాయార్థం వివిధవర్గాల నుంచి భారీగా విరాళాలు అందుతున్నాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులకు కాకతీయ కమ్మ సేవాసంఘం నాయకులు దిరిశాల రామకృష్ణ, ఎం.రాంబాబు, చిట్టే నాగేశ్వరరావు తదితరులు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. అలాగే, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గొర్రె సుబ్బారెడ్డి, దామా కృష్ణ, పణిదపు కోటయ్య కర్నాటి వెంకటనారాయణ రూ.50వేలు విరాళం అందజేశారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, ఉపాధ్యక్షుడు కల్లూరి సుబ్బు ఆధ్వర్యంలో రూ.50 వేలు విరాళం అందజేశారు. దర్శి పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు కేసరి శ్రీనివాసులు రూ.లక్ష, మేడగం పుల్లారెడ్డి రూ.లక్ష, దామెర్ల రమేష్ రూ.లక్ష, మిట్టా కొండారెడ్డి రూ.20 వేలు విరాళం అందజేశారు. కాగా, వినాయక చవితి సందర్భంగా దర్శి పట్టణంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాలను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శివరాజ్ నగర్‌లో నిమజ్జనం సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు రూ.10 లక్షల చెక్కు అందజేత

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 6: సీఎస్‌పురం గ్రామానికి చెందిన పీవీఎస్ లేబరేటరీస్ అధినేత పాములపాటి వెంకటశేషయ్య సోమవారం మంత్రి నారా లోకేష్‌బాబును విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వరద బాధితులను ఆదుకొనేందుకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర మంత్రులు లోకేష్, కొల్లు రవీంద్రలు శేషయ్యను అభినందించారు.

వరద బాధితులకు రూ.3.93 లక్షల విరాళం

దొనకొండ, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల నుంచి రూ.3.93 లక్షల నగదును సేకరించారు. ఈ నగదును సోమవారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులకు అందజేశారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, సెప్టెంబరు 9: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు మండలంలోని టీడీపీ నాయకులు, రేషన్‌షాపుల డీలర్లు, వివిధవర్గాల వారు తమవంతుగా రూ.3 లక్షల విరాళాలు వసూళ్లు చేశారు. ఈనగదును సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి అందజేశారు.

పామూరులో.. పామూరు, సెప్టెంబరు 9: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకొనేందుకు టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు పందిటి హరీష్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం లక్ష రూపాయల చెక్కు అందజేశారు. అలాగే, పామూరుకు చెందిన ఎం.దొరబాబు కూడా సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.50 వేలు అందజేశారు.

కలెక్టర్‌కు రూ.లక్ష చెక్కు అందజేత

తాళ్లూరు, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తాళ్లూరు గ్రామవాసి, బెంగుళూరు వ్యాపారవేత్త, సీపీ బ్రౌన్ సేవాసమితి వ్యవస్థాపకుడు ఇడమకంటి లక్ష్మిరెడ్డి రూ .లక్ష చెక్కును సీఎం సహాయ నిధికి సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. ఆయన వెంట తాళ్లూరు వైస్ ఎంపీపీ ఐ.వెంటేశ్వరరెడ్డి ఉన్నారు.

మండలంలోని శివరాంపురం గ్రామ ఎంపీపీ(ఏఏ) స్కూల్ విద్యార్థులు వరద బాధితుల కోసం గ్రామంలో రూ.15,500 విరాళాలు సేకరించారు. ఈ నగదును ఎంఈవోలు సుబ్బయ్య, సుధాకర్‌రావుకు అందజేసి సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పంపాలని తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 9: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందిచాలని టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు మండల పార్టీ సోమవారం వరద బాధితులకు విరాళాలు సేకరించారు. తాళ్లూరు గ్రామంలో టీడీపీ శ్రేణులు దుకాణాలు, టీషాపులు, ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాలేషా వలి, ఐ.శ్రీనివాసరెడ్డి, మీరా మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన కైపు రామకోటిరెడ్డి రూ.20 వేలు డాక్టర్ లక్ష్మికి అందజేశారు.


మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దేశ రక్షణకు సైనికుల త్యాగాలు మరువలేనివి

దర్శి, సెప్టెంబరు 9: దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు మరువలేనివని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. టెరిటోరియల్ ఆర్మీ ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాశ్మీరు నుంచి ప్రారంభమైన సైకిల్ యాత్ర సోమవారం దర్శికి చేరుకుంది. సైనికులు నిర్వహిస్తున్న సైకిల్ యాత్రలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. స్థానిక శివరాజ్‌నగర్‌లో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ దేశ భద్రత కోసం సైనికులు తమ ప్రాణాలను పణంగాపెట్టి పోరాడుతున్నారని అన్నారు. ఎంతోమంది విధి నిర్వహణలో అమరులవుతున్నారని అన్నారు. వారి త్యాగాలను నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఆర్మీ అధికారులు, అటవీ, పోలీసుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.3 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 9: సీఎస్‌పురం మండలం విట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థాన ఆదివారం ఆదాయం రూ.3,06,060 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల అ మ్మకం ద్వారా రూ.47,140, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.23,350, అన్న దానం విరాళాల ద్వారా రూ.2,07,954, ఇతర విరాళాల ద్వారా రూ.2,500 ఆదా యం వచ్చిందని పేర్కొన్నారు. శాశ్వత అన్నదానానికి కంభం ప్రాంతానికి చెం దిన ఓరుగంటి రఘు నారాయణ, అరుణ దంపతులు రూ.లక్షా యాభై వేలు అందజేశారు.

వరద బాధితులకు స్నేహహస్తం చేయూత

కనిగిరి, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితులకు కనిగిరి స్నేహహ స్తం స్వచ్ఛంద సంస్థ సోమవారం ప్రత్యేక వాహనంలో కనిగిరి నుంచి వెళ్ళి ని త్యావసర సరుకులు, కూరగాయలు అందచేసినట్లు ఆసంస్థ ప్రతినిధి సుధీర్ బాబు తెలిపారు. 400 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేసినట్టు తెలిపారు. అన్నవరపు లంక గ్రామంలోని వారికి దుప్పట్లు, రొట్టెలు అందజేశారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి


మృతిచెందిన బ్రహ్మం (ఫైల్)

ముండ్లమూరు, సెప్టెంబరు 9: ఈతకు వెళ్లి యువకుడు మృతిచెందాడు. సోమవారం సాయంత్రం మండలంలోని భీమవరంలో జరిగిన ఈప్రమాదంలో కోయ బ్రహ్మం(20) విగతజీవులయ్యారు. గ్రామానికి చెందిన కోయ బ్రహ్మం, గోపిచంద్, ఎస్.భాను స్నేహితులు. ఈతకొట్టేందుకు గ్రామ సమీపంలోని ఈదర వాగులోకి వెళ్లారు. ముందుగా గోపిచంద్, నలమోతు భాను ఈత కొట్టి గట్టుకు వచ్చి నిలబడ్డారు. కోయ బ్రహ్మం ఈత కొడుతుండగా ఒక్కసారిగా సుడిగుండంలో చిక్కుకున్నాడు. ఎంత సేపటికి బయటకు రాకపోవటంతో గట్టున ఉన్న స్నేహితులు కేకలు వేశారు. గ్రామస్థులు వచ్చి వాగులో చూడగా బ్రహ్మం మృతిచెంది ఉన్నాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు అంజయ్య, పూర్ణ, బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న ఎస్సై వై.నాగరాజు తన సిబ్బందితో వెళ్లి మృతదేహన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన కోయ బ్రహ్మం పదవ తరగతి వరకు చదివి మానేసి తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు.

రూ.10 లక్షలు పలికిన లడ్డూ

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 9: సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక చవితి లడ్డు పాటను మాజీ జడ్పీటీసీ ముత్యాల వెంకట సుబ్బారెడ్డి రూ.పది లక్షల పది వేలకు దక్కించుకున్నారు. అలాగే, కలిశంను మరో రూ.10 లక్షలకు పాడి కైవసం చేసుకొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

ముండ్లమూరు, సెప్టెంబరు 9: మండలంలోని పలుగ్రామాల్లో వినాయ క చవితి పండగను పురస్కరించుకొని భక్తులు ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు మూడు రోజుల పాటు పూజలు అందుకొని సోమవారం నిమ జ్జనానికి తరలించారు. కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీనివాస నగర్, నూజెండ్లపల్లి, పులిపాడు తండా, ఉమా మహేశ్వర అగ్రహారం, మారెళ్ళ, పెద ఉల్లగల్లు గ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను నిమజ్జనానికి తర లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నాగ రాజు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా గణనాథుల నిమజ్జనం

- కోలాహలంగా విగ్రహాల తరలింపు
- పలుచోట్ల అన్నదానం
- లడ్డూ వేలంలో ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు


పామూరు: భక్తులకు అన్నదానం వడ్డిస్తున్న సీఐ భీమానాయక్

కనిగిరి, సెప్టెంబరు 9: వినాయక చవితి పండగ సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన గణనాథుల నిమజ్జన వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. కనిగిరి పట్టణంలో గణేష్ విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. మూడవరోజు సోమవారం పట్టణంలోని కొన్ని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్ వద్ద ఉన్న గణేష్ విగ్రహం వద్ద లడ్డూ వేలం పాటలో కొంగల శ్రీను కుటుంబసభ్యులు రూ.25 వేలకు కైవసం చేసుకున్నారు. 20 వార్డులోని సాయిబాబాగుడి వీదిలో ఏర్పాటుచేసిన విగ్రహం ఉట్టికొట్టే కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో మూడు రోజులపాటు పూజలందుకున్న వినాయకుడి మట్టి ప్రతిమకు తెలుగుమహిళలు ఘనంగా ఊరేగించి నిమజ్జనం నిర్వహించారు. హనుమంతునిపాడు మండలంలోని నారపల్లి గ్రామంలోని వినాయకుడి విగ్రహం లడ్డూను రూ.1లక్షకు కాశయ్య పాడారు. హనుమంతునిపాడు గ్రామంలోని విగ్రహం లడ్డూను ఎంపీటీసీ ఉడుములు వెంకటసుబ్బారెడ్డి రూ.75 వేలకు కైవసం చేసుకున్నారు. కనిగిరి ప్రాంతంలోని విగ్రహాల నిమజ్జనాన్ని గొల్లపల్లి చెరువులో నిర్వహించారు. ఆయా ఏర్పాట్లను సీఐ ఖాజావలి నేతృత్వంలో ఎస్ఐ త్యాగరాజు పర్యవేక్షించారు.

దొనకొండలో.. దొనకొండ, సెప్టెంబరు 9: మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవితి పండగ సందర్భగా ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. దొనకొండ అడ్డరోడ్డు వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మండల యువ నాయకుడు శృంగారపు నాగసుబ్బారెడ్డి ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ప్రారంభించారు. నిర్వాహకులు గణేష్ విగ్రహలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఏర్పాటుచేసి నిమజ్జనాలకు తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై విజయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

కురిచేడులో.. కురిచేడు, సెప్టెంబరు 9: కురిచేడు మండలంలో ఏర్పాటుచేసిన గణనాథులను సోమవారం నిమజ్జనం చేశారు. కురిచేడులోని యోగయ్య స్వామి మఠం, ఎస్సీ కొత్తకాలనీలో ఏర్పాటు చేసి విఘ్నేశ్వర విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. కురిచేడు పక్కనే సాగర్ కాలువ ఉన్నా దూరంగా ఉన్న గుండ్లక్మ నదిలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు.

పామూరులో.. పామూరు, సెప్టెంబరు 9: వినాయకచవితి పండగ సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాలను సోమవారం నిమజ్జనానికి తరలించారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణంలోని ఆకులవీధిలోని దర్వాజ గల్లిలో ఏర్పాటుచేసిన బాలల గణపతిని నిమజ్జనం చేశారు. పట్టణంలోని భగత్ వీధిలో ఏర్పాటుచేసిన మండపంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ భీమానాయక్, సీఎస్‌పురం సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయిళ్ల నారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కావిటి సుబ్బయ్య, డీవీ మనోహర్, సర్పంచ్ సిద్దమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సత్రం బజారు, హాస్టల్‌వీధి, ఎన్జీవో కాలనీ, తూర్పు వీధి, తదితర ప్రాంతాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆకులవీధి దర్వాజ గల్లీలో నిమజ్జనం సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తరలివెళ్లారు.


కురిచేడు: నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

పీసీపల్లిలో.. పీసీపల్లి, సెప్టెంబరు 9: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలుగ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథుల విగ్రహాలను మూడవ రోజైన సోమవారం నిమజ్జనం చేశారు. ఉదయం పూజల అనంతరం మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దన్నపల్లి, గోపవరపువారిపల్లి, మలినేనివారిపల్లి, మాచర్లవారిపల్లి గ్రామాలతో పాటు మండలంలోని మరి కొన్ని గ్రామాల్లో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కోటయ్య సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఆకుకూరలతో రక్తహీనత నివారణ

పామూరు, సెప్టెంబరు 9: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు తీసుకుంటే రక్తహీనతను నివారించకోవచ్చునని సెక్టార్ సూపర్‌వైజర్ జి.పద్మజ తెలిపారు. మండలంలోని అయ్యన్నకోట అంగ న్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన పౌష్టికాహార మాసోత్సంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామంలో సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అధ్యక్షతన పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత నివారణ కోసం చిక్కీలు, బెల్లం, ఎండుఖర్జూరాలు, దానిమ్మ పండ్లు, మొలకెత్తిన విత్తనాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.విమల, రజియాబేగం, ఫణికుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు..

దొనకొండ, సెప్టెంబరు 9: చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, ఉలవలు, బొబ్బర్లతో ఆహారపదార్థాలు తయారుచేసుకొని తీసుకుంటే తల్లులు, పిల్లలకు మంచి పోషక విలువలు అందుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని పుచ్చకాయలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పదార్థాల ద్వారా సమతుల్య ఆహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంతోషకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

ముండ్లమూరు, సెప్టెంబరు 9: మండలంలో మైనర్ బాలికను మోసం చేసిన గంగన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీరామ్ జాన్‌హైడన్ ను సోమవారం సాయంత్రం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ అరెస్టు చేశారు. నిందితుడిని దర్శి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. బాలికను మోసగించిన ఘటనకు సంబంధించి గత నెల 28న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు దర్శి డీఎస్పీ కేసు నమోదు చేసుకొని అరెస్టు చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 10 సెప్టెంబరు 2024





బాపట్ల: జమ్ములపాలెం వెళ్ళేరోడ్డులో కాల్వ కట్టలు సరిగా లేక ముంపునకు గురైన పొలాలు.

ఐదేళ్ల పాపం..

డెల్టాకు శాపం

కృష్ణా పశ్చిమ డెల్టాలో వరిచేలు మునిగి పోయి పక్షం రోజులు దాటిపోతోంది. ఇన్ని రోజులవుతున్నా నీటి అడుగునున్న పంట ఇంకా బయటపడటంలేదు. నీరు పంట పొలాలను వది లిపోవటంలేదు. కారణం!... ఒక్కడ్రెయిన్‌కూడా ముంపు నీటిని సముద్రంలోకి తీసుకుపోయే పరి స్థితిలో లేదు. చేలల్లో నీటిని బయటకు పంపా ల్సిందిపోయి డ్రెయిన్‌లలో నీరే కట్టలు తెంచుకుని మరీ చేలపై పడిపోతున్నాయి. కొన్నిచోట్లయితే డ్రెయిన్‌లు, పొలాలు ఏకమైపోయాయి. కృష్ణా తీరంలో లక్షల క్యూసెక్కులు వచ్చిన వరద వెనక్కి వెళ్లిపోతే, మాగాణి చేలల్లో వర్షాలు ముంచేసిన పంట మాత్రం ఇంకా నీటి అడుగునే కుళ్లిపో తోంది. ఇంతకీ ఈ పాపం ఎవరిది? అప్పులుచేసి, చెమటోడ్చి పంట పండించే డెల్టా రైతన్నకు ఇంత కష్టం రావటానికి కారకులెవరు? అన్ని ప్రశ్నలకు ఒకే సమాధానం... గత ప్రభుత్వం చేసిన పాపమే ఇప్పుడు రైతన్నకు శాపంగా మారిందని, పంట పండించేందుకు నీరు లేక అవస్థలు పడినరోజులు పోయి, అతివృష్టిని తలపించే వాననీటి ముంపు రైతన్నకంట కన్నీరు తెచ్చిపెడుతోంది. కృష్ణా డెల్టా చరిత్రలో ఇంతటి దారుణ పరిస్థితులు గతంలో ఎన్నడూ లేకపోయినా ఇప్పుడు దాపురించాయి.

- ఒక్క ఖరీఫ్‌కు ముందూ కాల్వల మరమ్మతులు చేసిందిలేదు
- డ్రెయిన్‌ల పరిస్థితి మరీ దారుణం
- నేడు గండ్లు పడటానికి, పంట మునగటానికి అదే కారణం
- ఓ అండ్‌ఎం పనులే దిక్కు.. అవీ చేసేందుకు ముందుకు రాక
- సీజన్ ముందు భారీ కేటాయింపులు
- సకాలంలో గత ప్రభుత్వం ఒక్కపైసా విదిల్చిందిలేదు...
- పనులు చేసి కోర్టు మెట్లెక్కితేనే కాంట్రాక్టర్‌లకు డబ్బు
- గత ప్రభుత్వం చేసిన పాపం ఇప్పుడు శాపంగా మారి..

రైతుల నుంచి వసూలు చేసిన నీటి తీరువా ఖర్చు చేయలేదు

తెనాలి, సెప్టెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ కాలంలోని ఐదేళ్లలో ఒక్క కాల్వపై ఒక్క పనికూడా చేయకపోవటం, డ్రెయిన్‌ల దుస్థితిని వరద నీటికి వదిలేయటంతో నేడు విపత్తు కొంప ముంచుతోంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.73 లక్షల ఎకరాల్లో ఏటా ఖరీఫ్ వరి సాగవుతోంది. ఇదంతా బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోనే ఉంది. ఈ మూడు జిల్లాల పరిధిలో ఒక ప్రాంతంలో గడచిన ఐదేళ్ల లో ఒక్క కాల్వ కట్టపై పిడికెడు మట్టిపోసిన పాపాన పోలేదు. కాల్వల చివరి భూములకు నీరందకున్నా పూడిక తీసిన దిక్కులేదు. మురుగు కాల్వల పరిస్థితి అయితే మరీ దారుణం. ఒక్క డ్రెయి న్ మరమ్మతులు చేసినవారే లేరు. ఒకవేళ చిన్నాచితక పనులు చేసినా గత వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే. ఆ సంవత్సరం పనులు చేసిన కాంట్రాక్టర్‌లకు రూపాయికూడా ఇవ్వకపోవటంతో తర్వాతి నాలుగేళ్ల పనులు చేయటానికి అసలు ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదంటే అతిశయోక్తి కాదు. పైగా చేసిన పనులకోసం కోర్టులను ఆశ్రయించాల్సిన దుస్థితి. ఒక్క మాటలో చెప్పాలంటే రైతుల నుంచి నీటి తీరువా రూపంలో వసూలు చేసే మొత్తాన్ని కూడా వారికోసం ఖర్చు చేయలేదంటే దీనికిమించిన దారుణం మరోటి ఉండ దేమో! సాధారణంగా ఎకరాకు రూ. 200 చొప్పున నీటి తీరువా ఏటా వసూలు చేస్తారు. డెల్టా కాల్వల పరిధిలో 5.73 లక్షల ఎకరాల భూమి ఉంటే, ఎకరాకు రూ. 200 చొప్పున రూ. 11.46 కోట్లు వసూలు చేసేవారు. అయితే ఈ మొత్తంలో సగంకూడా ఖర్చు చేసిందిలేదు. కనీసం ఆ మొత్తాలు ఖర్చు చేసినా ఇంత దారుణ పరిస్థితి ఉండేది కాదు. అంటే ఈ ఐదేళ్లలో రూ. 60 కోట్ల వరకు నీటి తీరువా వచ్చినా ఒక్క సంవత్సరంలో కూడా ఆ నిధులు వెచ్చించిందిలేదనేది అధికారుల మాటే. కొత్తగా నిధులు ఇవ్వకున్నా, రైతులకోసం వారి దగ్గర నుంచి వసూలు చేసిన నిధులనుకూడా ఖర్చు చేయకపోవటం చేతకానితనమే. అయితే వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలో కాంట్రాక్టర్‌లు పనులు చేసేందుకు ఉత్సాహం చూపించారు. అయితే ఆ సంవత్సరం పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధులు మాత్రం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో అధికారులు, ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతూనే వచ్చారు. కొంతమంది చేసేదిలేక కోర్టును ఆశ్రయిస్తే, చివరకు ఒకరిద్దరికి మాత్రం ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. మిగిలినవారు నేటికీ డబ్బు కోసం ఎదురు చూస్తుంటే, తర్వాత డబ్బు చేతికందినవారుకూడా పనుల చేయటానికి తర్వాత నాలుగు సంవత్సరాలు ఆసక్తి చూపలేదు. దీంతో వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. చిన్నచిన్న పనులు చేశామనిపించి ఉన్న నిధులు దోచుకుతిన్నారు. ఈ పాపమే నేడు రైతులకు శాపంగా మారింది. ప్రధానంగా తుంగభద్ర డ్రెయిన్, రేపల్లె, బీఎం డ్రెయిన్‌లు, జంపని డ్రెయిన్‌ల వంటివాటి వెంటున్న పొలాలు మొత్తం నీటిలో మునిగిపోయి ఉన్నాయి. ఇవి ఎప్పుడు బయటపడతాయో! అసలు పంట చేతికి అందుతుందో లేదో కూడా రైతులకు అంతుబట్టని విషయంగా మారింది.

వర్షాభావం వస్తే, మరో ప్రాంతంలో వర్షాలు పడటం, పంటకు నీటి కష్టాలు లేకుండా ఉండటం ఇప్పటి వరకు చూ స్తూ వచ్చాం. కానీ ఈ ఖరీఫ్ సీజన్‌లో మాత్రం మూడు జిల్లాల్లో ఒకే పరిస్థితి. ఒక్క ఎకరా కూడా బయట లేకుండా నీటిలో మునిగి పంటదిగుబడిపై ప్రభా వం చూపే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఇదే రైతన్నను కలవరపాటుకు గురిచేస్తోంది.

ఓ అండ్ ఎం కింద భారీగా మంజూరు చేశామనిపించి...

ఏటా ఖరీఫ్ సీజన్ వస్తుందంటే డెల్టా కాల్వల మరమ్మతులు, డ్రెయిన్‌ల పూడికతీత వంటివి చేపట్టటం ఆనవాయితీ. నీటిపారుదల శాఖ ఆ మూడు నెలలు టెండర్లు పిలవటం దగ్గర నుంచి పనులు పూర్తయ్యేవరకు విశ్రాంతి లేకుండా గడిపేవారు. అయితే గత వైసీపీ సర్కారు వచ్చాక కాల్వలకు నీరు లేకున్నా పర్వాలేదు. జగనన్న అడుగుపెడితే చాలు చేలన్నీ పచ్చబడిపోతాయన్న చందంగా ఊదరగొట్టిన ప్రభుత్వ పెద్దలు, పనులు చేసే విషయాన్ని పక్కన పెట్టేశారు. అయితే అసలు చేయలేదనిపించుకోకుండా ఉండటానికి ఖరీఫ్ సీజన్‌కు ముందు ఓ అండ్ ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) పనులకు నిధులు భారీగా మంజూరు చేశామని గొప్పలుచెప్పి వదిలేసిన పరిస్థితి. అయితే ఏ సీజన్ లోనూ పూర్తిస్థాయిలో కాదుకదా! కనీసం సగం నిధులుకూడా ఖర్చు చేసిన పాపానపోలేదు. 2020-21లో రూ. 14.5 కోట్లు, 2021-22 ఖరీఫ్ సీజన్‌కు రూ. 17కోట్లు, 2022-23 సీజన్‌కు రూ. 21కోట్లు, 2023-24 సీజన్‌కు రూ. 22 కోట్లు, 2024-25కు రూ. 13.62 కోట్లు మంజూరు చేశామనిపించారు. అయితే వీటిలో ఏ ఒక్క సంవత్సరం నిధులు పూర్తిగా ఖర్చు చేసిందేలేదు. సాధారణంగా కాల్వలు, డ్రెయిన్‌లలో పూడిక తీత, గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించటం, కట్టలు దెబ్బతిని ఉంటే, వాటిని పటిష్ట పరచటం, గండ్లుపడే ప్రమాదం ఉంటే వాటిని పూడ్చటం, షట్టర్‌లు, స్ట్రక్చర్స్ దెబ్బ తింటే వాటి మరమ్మతులు చేయటం పరిపాటే. వీటికోసం ప్రత్యేకంగా చేసేదికూడా ఉండదు. డెల్టా కాల్వల వ్యవస్థ ఏర్పడిన తర్వాత కాలం నుంచి వస్తున్న తంతే. అయితే గత వైసీపీ సర్కారు మాత్రం వీటిని కేవలం వారి ఆదాయ వనరుగానే చూసుకున్నారు. చిన్నపాటి తూటుకాడ తొలగింపు పనులు మాత్రం చేశామనిపించి కార్యకర్తల జేబుల్లోకి దోచిపెట్టారు. రైతులకు మాత్రం కన్నీరు మిగిల్చారు.



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం

కన్నీటి ధారలు



కృష్ణమ్మ మహోగ్రరూపానికి అన్నదాత చిగురుటాకులా వణికిపోయాడు. వేల ఎకరాల్లో పైరు తుడిచిపెట్టుకుపోయింది. వరదలు తగ్గుముఖం పట్టినా లంక గ్రామాల్లోని ఉద్యాన పంటలతో పాటు వేల ఎకరాల్లో వరిపైరు ఇంకా ముంపులోనే ఉండడం అన్నదాతలకు మరింత ఆందోళన కలిగిస్తోంది. పెట్టిన పెట్టుబడిలో ఒక్క రూపాయి చేతికొచ్చే అవకాశం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వర్షం కూడా మళ్లీమళ్లీ కురుస్తుండడంతో పంటలమీద పూర్తిగా ఆశలు వదిలేసుకున్నట్లేనని అన్నదాతలు చెబుతున్నారు. ఇప్పటికీ చెరుకుపల్లి పరిధిలోని వరి పొలాలు, భట్టిప్రోలు మండల పరిధిలోని అరటి, బొప్పాయి తోటలు ఇంకా ముంపులోనే ఉండడం అన్నదాతలకు జరిగిన తీవ్ర నష్టానికి నిదర్శనంగా కనబడుతోంది.

- రైతుల్ని నిండా ముంచేసిన వరదలు
- జిల్లాలో దాదాపు రూ.250 కోట్ల మేర నష్టం
- లంక గ్రామాల్లో వాణిజ్య పంటలన్నీ వరదపాలు
- నష్టపోయిన 42,000 మంది అన్నదాతలు
- ఇంకా ముంపులోనే వేల ఎకరాల్లోని పంట

ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రధానంగా వరి నష్టం (హెక్టార్లలో)

బాపట్ల	5,850
అమర్తలూరు	4,150
చుండూరు	4,350
చెరుకుపల్లి	4,000
నగరం	1900
రేపల్లె	2,900
వేమూరు	3,800
భట్టిప్రోలు	1,900
కారంచేడు	1,200
కర్లపాలెం	2,700
పిట్టలవానిపాలెం	1,400

బాపట్ల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.250 కోట్ల మేర పంటలకు నష్టం వాటిల్లినట్లు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు చెబుతుండగా ఇందులో ఉద్యాన పంటల వాటానే సుమారు రూ.129 కోట్లుగా ఉండేలా కనిపిస్తోంది. దాదాపు 42,000 మంది రైతులు వరదల ప్రభావం వల్ల నష్టపోయి ప్రభుత్వం చేసే సాయం పైనే ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన పంటల విషయంలో సిబ్బంది పంట నష్టం గణన చేపడుతున్నారు.



రావి అనంతవరం వద్ద బొప్పాయితోట పరిస్థితి


ఉద్యాన పంటలకు జరిగిన నష్టం ఇలా..

లంక గ్రామాల్లో సాగు చేసే ఉద్యాన పంటలన్నీ వాణిజ్య పంటల కోవలోకే రానుండడంతో వీటికి అయ్యే పెట్టుబడి ఖర్చులు కూడా ఎక్కువే. కృష్ణమ్మ ఉధృతికి పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన అరటి, బొప్పాయి, పసుపు, కూరగాయల పంటలు నామరూపాల్లేకుండా పోయాయి. పంటలన్నీ కూడా వారానికి పైగానే ముంపులోనే ఉండడంతో ఎక్కడా ఒక్క ఎకరం పైరు కూడా చేతికొచ్చే అవకాశలు లేవని రైతులు చెబుతు న్నారు. వరద ముంచెత్తిన తర్వాత ప్రాథమిక నివేదికల ప్రకారం లంక గ్రామల్లో 4,658 హెక్టార్ల ఉద్యాన పంటలకు డ్యామేజీ జరిగి నట్లు అధికారులు అంచనా వేశారు. కొల్లూరు మండల పరిధిలో 15 గ్రామాలు, భట్టిప్రోలు పరిధిలో 6, చుండూరు 3 లంక గ్రామాలలో నష్టం వాటిల్లినట్లు తేల్చారు. వీటికి సంబంధించి దాదాపు రూ.129 కోట్లమేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా లెక్కకట్టారు. పంటల వారీగా చూస్తే ప్రధానంగా అరటి 1450 , పసుపు 1348, కూరగా యలు 450, జామ, నిమ్మ, 400 హెక్టార్లకు నష్టం వాటిల్లింది

37,000 హెక్టార్లలో వరి..

వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా 37,000 హెక్టార్లలో వరి నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా తేల్చింది. ఇంకో వెయ్యి హెక్టార్ల పరిధిలో మినుము, శనగ పైర్లకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. ఇంకా దాదాపు 17,000 హెక్టార్లలో వరి ముంపులోనే ఉండగా ఎకరానికి దాదాపు పది నుంచి పదిహేను వేల వరకు పెట్టుబడి పెట్టా మని ఒక్క రూపాయి కూడా తిరిగి వచ్చే అవకాశం లేదని అన్నదాతలువా పోతున్నారు.

కొల్లూరు: 850 హెక్టార్లలో వరి ప్రధానంగా వరద బారిన పడడంతో అన్నదాతల ఆవేదనకు అంతేలేకుండా పోయింది. వరికి సంబంధించి జిల్లాలో దాదాపు రూ.121 కోట్ల మేర నష్టం వాటిల్లగా 32,000 మంది రైతులు వరదల వల్ల నష్టపోయారు



పోతార్లంక వద్ద అరటి తోట దుస్థితి

క్షేత్రస్థాయిలో జరుగుతున్న పంట నష్టం గణన

మూడు రోజుల నుంచి జరుగుతున్న పంట నష్టం గణన మరో రెండు రోజుల్లో పూర్తి కానుంది. సోమవారం సాయంత్రానికి 2,462 హెక్టార్లలో ఉద్యాన పంటల గణన పూర్తికాగా, వరికి వచ్చే సరికి 20,000 హెక్టార్ల వరకు శాస్త్రీయంగా పంట నష్టాన్ని నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేశారు. వాస్తవానికి పంట నష్టం లెక్కింపును ఈ నెల పదో తారీఖు కల్లా పూర్తి చేయాలని తొలుత భావించారు. కానీ శని, ఆదివారాల్లో కూడా వర్షం కురవడంతో ఆశించిన స్థాయిలో గణన పూర్తి కాలేదు. బుధవారాని కల్లా కచ్చితమైన లెక్కలతో పంట నష్టాన్ని నమోదు చేసి ఆ తర్వాత రెండు రోజుల పాటు ఆ వివ రాలను ఆయా గ్రామాలలో సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శించనున్నారు. రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలు వస్తే స్వీకరించి మార్పులు, చేర్పులు ఉంటే చేపట్టి ఈ వారాంతానికి ప్రభుత్వానికి నివేదిక సమర్పించే దిశగా వ్యవసాయ శాఖ అడుగులేస్తోంది.

ఇసుక రవాణా ఛార్జీలు తగ్గింపే లక్ష్యం

సమీక్ష సమావేశంలో కలెక్టర్


బాపట్ల, సెప్టెంబరు 9 : ఉచిత ఇసుక విధానంలో వాహనాల రవాణా ఛార్జీలను తగ్గించటమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఇసుక రేవుల వద్ద వాహనదారులు గంటల తరబడి నిల్చునే పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ఇసుక రవాణా ఛార్జీలను తగ్గిస్తూ జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుందని ప్రకటించారు. 4.5 మెట్రిక్ టన్నుల ఇసుక 10కిలో మీటర్ల లోపు ఒక ట్రాక్టర్ రవాణా ఖర్చు 549 రూపాయలుగా నిర్ణయించామన్నారు. అలాగే 20కిలోమీటర్లకు 1098 రూపాయలకు, 30కిలోమీటర్లకు 1647 రూపాయలు, 40కిలోమీటర్లకు 2,196 రూపాయలు, 40కిలోమీటర్లు దాటితే కిలోమీటర్‌కు 6రూపాయల చొప్పున ధర ఉంటుందన్నారు. 6టైర్ల వాహనానికి, 10టైర్ల వాహనానికి ధరలు నిర్ణయించామన్నారు. ప్రజలు ఈవిషయాన్ని గుమనించాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో వాహనాల రవాణా ఛార్జీలు ప్రజలకు కొంతభారంగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈనేపథ్యంలో ధరలు తగ్గించటానికి జిల్లా స్థాయి కమిటీలో వాహనాల యజమానులతో చర్చించి ధరలు నిర్ణయించామన్నారు. బాపట్లజిల్లాలో ప్రస్తుతం జువ్వలపాలెం, గాజుల్లంక ప్రాంతాలలో ఇసుకరేవులు ఉన్నాయన్నారు. ఇసుక లభ్యత ఉండేప్రాంతాలలోని సచివాలయాల వద్ద ప్రజలు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. లేదా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చుఅన్నారు. వినియోగదారుడికి, వాహనదారుడికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. అదనపు వసూళ్ళకు పాల్పడే వాహనదారులు నుండి వినియోగదారులకు ఎలాంటి సంబంధంలేకుండా ఈవిధానం అమలలోకి వస్తుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, మైన్స్ ఎండీ రాజేష్, ఆర్డీవో సురేష్, వాహనాల అసోసియేషన్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

పవన్ మంచి మనస్సుకు నిదర్శనమే గ్రామాల అభివృద్ధికి భరోసా: - మంత్రి మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 09: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వరద బాధితులకు అండగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ కొనియాడారు. ప్రతి పంచాయతీకి పవన్ ప్రకటించిన రూ. లక్ష సహాయాన్ని గుంటూరు, బాపట్ల జిల్లాల సర్పంచ్‌లకు తెనాలిలో సోమవారం ఆయన పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా మంత్రి మనోహర్, ఎంపీ టి.కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కాఆనంద్‌బాబు హాజరై చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రజల కోసం, వారి అభ్యున్నతికోసం అనునిత్యం తపించే వ్యక్తి పవన్‌కల్యాణ్ అన్నారు. అనుకోని విపత్తుకారణంగా ప్రజలు ఎక్కడా ఇబ్బంది పడకూడదన్న మంచి మనస్సుతో రూ.4 కోట్లు అందించి ప్రతి పంచాయతీకి రూ. లక్షవంతున వితరణ చేశారన్నారు. ప్రజా ప్రతినిధులమని గొప్పలు చెప్పుకోవడం గత ప్రభుత్వాలకు చెల్లిందని విపత్తులో ప్రజలు ఇబ్బందులు పడకూడదని సాయం అందించి ప్రజాప్రతినిధులంటే వారి సేవకులని పవన్‌కల్యాణ్ నిరూపించారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలందరికి మరింతగా మంచి జరిగేలా పవన్‌కల్యాణ్ సూచనలతో ముందుకు సాగుతామని మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు చెక్కును అందిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

కాలువలోకి దిగి డిగ్రీ విద్యార్థి మృతి

గవినివారిపాలెంవాసిగా గుర్తింపు

పిడుగురాళ్ల వద్ద ఘటన.. నేడు స్వగ్రామానికి మృతదేహం


బాలు (ఫైల్)

చీరాలటౌన్, సెప్టెంబర్ 9 : కుటుంబంతో కలిసి మొక్కుబడి చెల్లించుకునేందుకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి గుంటూరు జిల్లా పిడుగురాళ్ల వద్ద మృత్యువాత పడ్డాడు. అందిన వివరాల ప్రకారం.. చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన మిండా వెంకటరావు, గంగమ్మ దంపతులకు బాలు(19) చిన్నకుమారుడు. పెద్ద కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. వీరంతా పిడుగురాళ్ల వద్ద అడవి ఉప్పలపాలెం జిల్లెళ్లమూడి అమ్మవారికి మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం ఉదయం వెళ్లారు. కార్యక్రమాలు ముగిశాక అక్కడున్న కాలువలో మునిగేందుకు కుటుంబ సభ్యులు కొంతమంది దిగారు. ప్రమాదవశాత్తు బాలు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. పోలీసుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 10 కిలో మీటర్లు దూరంలోని లాకుల వద్ద సోమవారం సాయంత్రం మృతదేహం పైకి తేలింది. మృతదేహాన్ని ఒడ్డుకు లాగేందుకు తాడు కట్టడానికి వెళ్లిన వ్యక్తి పట్టుతప్పి లాకుల కిందికు వెళ్లిపోయారు. ఆ సమయంలో ఒడ్డున ఉన్న అందరూ కంగారు పడ్డారు. వెంటనే ఆయన కనిపించడంతో ఊపిరిపీల్చుకున్నారు. తాడు సహాయంతో బాలు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. నేడు స్వగ్రామానికి బాలు మృతదేహం రానుంది

వ్యక్తి ఆత్మహత్య

చినగంజాం, సెప్టెంబరు 9 : మండలంలోని పెద్దపల్లెపాలేనికి చెందిన దండుప్రోలు సోమయ్య(31) ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సోమయ్యకు సంవత్సరం కిందట సింగరాయకొండ మండలం కరేడు గ్రామానికి చెందిన జ్యోతితో వివాహమైంది. వీరికి 15రోజుల బాబు ఉన్నాడు. వివాహానికి ముందు సోమయ్యకు అప్పులున్నాయి. చేసిన అప్పులు తీరకపోవడంతో మద్యానికి బానిసయ్యారు. కొంతకాలం బాపట్ల శ్రీరామ్ చిట్స్‌లో అతడు పనిచేశారు. 20 రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లారు. కుటుంబ సభ్యులు ఉద్యోగం కోసం బయటకు వెళ్లి ఉంటాడని భావించారు. గ్రామానికి సమీపంలోని సరుగుడు తోటలో ఉరి వేసుకొని మృతి చెంది ఉండడం గొర్రెల కాపరులు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. అతని చేతిమీద భార్య పేరు జ్యోతి అని ఉండడంతో సోమయ్యగా కుటుంబసభ్యులు గుర్తించారు. అతని తమ్ముడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆధికారి పి.పేరిలింగేశ్వరావు తెలిపారు. పోలీసులు స్థలాన్ని పరిశీలించారు.

కిడ్నాప్ చేసి బెదిరించారంటూ ఫిర్యాదు

బాపట్ల,సెప్టెంబరు 9 : చినగంజాముండలం సోపిరాల గ్రామానికి చెందిన తండ్రి కూతుళ్ళను పోలీసుల పేరు చెప్పి కిడ్నాప్ చేయటమే కాకుండా తమకు సంబంధించిన భూములు, ఇళ్ళు రాయించుకుంటున్నట్లు ఖాళీ స్టాంప్‌లపై సంతకాలు చేయించుకున్నారని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే చినగంజాం మండల సోపిరాల గ్రామంలో నివాసం ఉంటున్న దేవరకొండ సుబ్బారావు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 6వ తేది మధ్యాహ్నం ఇంట్లో తనకుమార్తెలు గాయత్రి, మౌనికలతో కలిసి భోజనం చేస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు వచ్చి చినగంజాం ఎస్సై రమ్మన్నారంటూ పిలిచి ముగ్గురిని కారులో ఎక్కించుకొని తీసుకెళ్ళారు. తీరా చినగంజాం స్టేషన్‌కు తీసుకెళ్ళకుండా చిలకలూరిపేట రూరల్ పోలీసుస్టేషన్ వెనుక ఓ పాడుపడిన ఇంట్లో పెట్టి కులం పేరుతో దూషించి అత్యాచారం చేస్తామని బెదిరించి చంపితే నీకు దిక్కేవరంటూ వారితో బలవంతంగా ఖాళీస్టాంప్‌లు, ప్రామసరీనోట్‌లపై సంతకాలు చేయించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిలో కానిస్టేబుళ్ళమని చెప్పుకుంటున్న మదు, ఎం.సుబ్రహ్మణ్యం అనేవారు వైట్ పేపర్లపై కూడా సంతకాలు పెట్టించుకున్నారని వారు పేర్కొన్నారు. ఎవరికైన చెబితే పరిస్థితి దారుణంగా ఉంటుందని పెట్రోల్ పోసి తగలబెడుతామని హెచ్చరించి వదిలిపెట్టినట్లు వారు పేర్కొన్నారు. కావున తమను నిర్భంధించి బెదిరించిన మదు, సుబ్రహ్మణ్యం, ప్రతాప్, రంజిత్‌లతోపాటు మిగిలినవారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని సంతకాలు చేయించుకున్న పత్రాలు తిరిగి ఇప్పించాలని ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సోమవారం ఎస్పీ తుషార్ డూడిని వారు కోరారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించండి : ఎస్పీ


వాడరేవును పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

చీరాలటౌన్, సెప్టెంబరు 9 : వినాయక నిమజ్జనాలను సముద్రతీరంలో నిర్దేశించిన ప్రదేశాల్లోనే నిర్వహించాలని ఎస్పీ తుషార్‌డూడీ సూచించారు. సోమవారం చీరాల మండలం వాడరేవు తీరంలో ఎస్పీ పర్యటించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. నిమజ్జనాలకు వచ్చే సమయంలో సంబంధిత విగ్రహ కమిటీ ప్రతినిధులను ప్రమాదాలపై అప్రమత్తం చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐలు సత్యనారాయణ, ఎస్సైలు వెంకటేశ్వర్లు. శివకుమార్ ఉన్నారు.

ప్రకాశం పూర్వ డీపీవోపై విచారణ చేపట్టండి

బాపట్ల, ప్రకాశం కలెక్టర్‌లకు పలువురు వినతి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగులు

పర్చూరు, సెప్టెంబరు 9 : ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారి అక్రమార్జనే ధ్యేయంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి భారీగా దోచుకున్నారని, ప్రకాశం పూర్వ డీపీవో నారాయణరెడ్డిపై విచారణ చేపట్టాలని ప్రకాశం, బాపట్ల కలెక్టర్‌లకు పర్చూరు నియోజకవర్గానికి చెందిన దేవతోటి నాగరాజు, రమేష్, రాజేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. నారాయణరెడ్డి అక్రమ సంపాదనే లక్ష్యంగా ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచారన్నారు. చిన్నగంజాం మండలం కడవకుదురు సామాన్య కుటుంబం నుంచి వచ్చి నేడు కోట్లు అర్జించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల చిట్టాలను చేతిలో పెట్టుకొని, వారిని బెదిరించి అక్రమంగా దండుకున్నారన్నారు. అక్రమార్కులతో సైతం చేతులు కలిపి ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారన్నారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతల అండతో దందా కొనసాగించారని పేర్కొన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలలో ఆయా గ్రామాల అధికారుల బదిలీల పేరుతో పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. చినగంజాం మండల పరిధిలో 400 రోడ్లు నిర్మించకుండా నిర్మించినట్లు కోట్లలో బిల్లులు డ్రా చేసి వర్షాలకు కొట్టుకుపోయినట్లు రికార్డుల్లో రాసినట్లు వారు ఆరోపించారు. తక్షణమే డీపీవోను విచారించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ తవ్వకాలను పరిశీలించిన మైనింగ్ అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక


అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

చీరాలటౌన్, సెప్టెంబరు 9 : ప్రభుత్వ నిబంధనలను విస్మరించి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ మైనింగ్ అధికారులు హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ చీరాల పరిధిలోని కీర్తివారిపాలెం - పెర్లవారిపాలెం మధ్యగల ఫారెస్ట్ భూముల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ జరిగిన తవ్వకాలను ఫొటోలు, వీడియోల రూపంలో ఆధారాలను సేకరించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు. పరిశీలనలో మైనింగ్ ఆర్ఐ కనపర్తి రాజు, రెవెన్యూ ఆర్ఐ శేఖర్, సిబ్బంది ఉన్నారు.

మామూలంతే!

ఉన్నతాధికారుల ఆదేశాలు తూచ్

చీకటి పడితేనే కేసు నమోదు

పగలు ఫిర్యాదులు అందినా రాత్రి వరకు ఆగాల్సిందే

సెటిల్‌మెంట్లకే మొగ్గుచూపుతున్న వైనం

చర్చనీయాంశంగా మార్కాపురం పోలీసుల తీరు

అను కున్న మేరకు జేబులు నిండితే సరే. లెక్క ఏ మాత్రం తగ్గిందా అప్పుడు చట్టం గుర్తుకు వచ్చి కేసులు నమోదవుతాయి. పంచాయితీల తతంగమంతా పగలు జరుగుతోంది. రాత్రిళ్లు మాత్రమే కేసులు నమోదు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు మార్కాపురం పోలీసులు. కిందిస్థాయి అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తూ వివాదాలకు చోటిస్తున్నా పర్యవేక్షణ అధికారులు మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా అన్ని స్థాయిల వారికి చేతులు తడుస్తుండటం వల్లే ఇలాంటి వ్యవహారాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయనేది నిర్వివాదాంశం.

మార్కాపురం, సెప్టెంబరు 9 : ఫిర్యాదు అందిన వెంటనే ప్రాథమికంగా కేసు నమోదు చేయాలనేది పోలీసు ఉన్నతాధికారుల ఆదేశం. నమోదు అనంతరం విచారణలో కేసు తీవ్రతను బట్టి సెక్షన్లు మార్చుకునే వెసులుబాటు ఉంది. మార్కాపురం పోలీసులకు మాత్రం ఇవేం పట్టడం లేదు. ఫిర్యాదు ఎప్పుడు అందినా వారికి నచ్చినప్పుడు మాత్రమే కేసు నమోదు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కనబెట్టి రాజకీయ నాయకుల సిఫార్సులు, మధ్యవర్తుల బేరసారాలను బేరీజు వేసుకుని మాత్రమే పనిచేస్తున్నారు.

ఫిర్యాదులు ఎప్పుడు అందినా రాత్రిళ్లే కేసు నమోదు

మార్కాపురం సర్కిల్ పరిధిలోని టౌన్, రూరల్ పోలీసు స్టేషన్‌లలో అధికారులు ఎవరు మారినా కొన్నేళ్ల నుంచి కేసులు నమోదు కావాలంటే చీకటి పడాల్సిందే. ఫిర్యాదు ప్రాధాన్యతను పక్కన బెడితే రాత్రి 8 గంటలు దాటిన తర్వాతనే కేసు నమోదవుతుంది. పగలు ఎలాంటి ఫిర్యాదు అందినా దాన్ని సాయంత్రం వరకు నాన్చడం అలవాటు చేసుకున్నారు. ఫిర్యాదు స్టేషన్‌కు వచ్చిన వెంటనే కొందరు మధ్యవర్తులు గద్దల్లా వాలుతున్నారు. వారు ఇరుపక్షాలను స్టేషన్ పరిసరాల్లోనే కూర్చోబెట్టి లెక్క సరిచేసి అధికారి వద్దకు పంపుతారు. ఇరుపక్షాలు సమ్మతించని పక్షంలోనే కేసు నమోదుకు మొగ్గుచూపుతున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులకు మధ్యవర్తిత్వం వహించేందుకు కొందరు అదేపనిగా స్టేషన్ చుట్టూ తిరుగుతుండటం గమనార్హం. వారిలో కుల సంఘాలకు చెందిన వాళ్లు కొందరైతే, సమాజంలో గౌరవప్రదమైన వృత్తుల్లో కొనసాగే వాళ్లు మరికొందరు ఉన్నారు. గతంలో కొందరు డివిజన్ స్థాయి అధికారులు ఈ తంతంగాన్ని నివారించినా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

అడ్డుకట్ట వేసేదెవరు..

జిల్లా స్థాయిలోని పోలీసు ఉన్నతాధికారులు ప్రతి ఫిర్యాదుదారునికి చట్టప్రకారం న్యాయం చేయాలని కింది స్థాయి అధికారులకు ఆదేశాలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. స్టేషన్‌కు కొత్త అధికారి వచ్చినా కిందిస్థాయి సిబ్బంది సూచనలు, సలహాల మేరకే నడుచుకుంటున్నారు. వారు చెప్పిందే వేదంగా పనిచేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రధానంగా భూలావాదేవీలు, నగదు లావాదేవీలకు సంబంధించిన కేసుల్లో కిందిస్థాయి సిబ్బంది కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఎవరికి అందేవి వారికి అందుతుండటంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సాధారణ కేసుల్లో అయితే ఇరుపక్షాలు తప్పక చేతులు తడిపితేనే కింది స్థాయి సిబ్బంది అధికారి వద్దకు తీసుకెళ్తున్నారు. పోలీసు స్టేషన్‌లలో జరుగుతున్న ఈ తంతును ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేర్చాల్సిన నిఘా విభాగం కూడా సక్రమంగా పట్టించుకుంటున్న దాఖలాలు ఉండటం లేదు. నిఘా విభాగం సిబ్బంది ఏళ్లుగా పాతుకుపోయిన వాళ్లు కావడం కూడా వాస్తవాలు పైస్థాయి అధికారులకు తెలియకుండా మరుగున పడిపోవడానికి కారణమవుతోంది. జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విచారించి తప్పక చర్యలు తీసుకుంటా

బి.లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి, డీఎస్పీ, మార్కాపురం

మార్కాపురం సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్‌లలో కేసుల నమోదుకు తాత్సారం చేయడం, పంచాయితీలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. మార్కాపురం టౌన్, రూరల్ స్టేషన్‌ల పరిధిలో విచారించి తప్పక చర్యలు తీసుకుంటాం. అలాంటివి ఏమైనా ఉంటే వెంటనే అరికడతాం. ప్రజలకు తక్షణ న్యాయం అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం.

నిధులున్నా ఏం చేయలేరు!

గ్రామపంచాయతీల్లో రూ.40 కోట్ల నిధులు

డ్రా చేసేందుకు విధివిధానాలు ఇవ్వని ప్రభుత్వం

మరోసారి విద్యుత్ బిల్లులు,

కార్మికులకు వేతనాలు చెల్లించే అవకాశం

పంచాయతీ పాలకవర్గాల్లో ఆందోళన


సింగరాయకొండ పంచాయతీ కార్యాలయం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9: గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ ఆర్థికసంఘం నిధులు వచ్చినా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామ పంచాయతీలకు నిధులు వచ్చి పక్షం రోజులు గడుస్తున్నా వాటిని వినియోగించుకునేందుకు ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించకపోవడంతో పాలకవర్గాలు ఏమి చేయలేక ఎదురుచూస్తున్నాయి. జిల్లాలోని 729 గ్రామపంచాయతీలకు 15వ ఆర్థికసంఘం ద్వారా సుమారు రూ.40కోట్ల వరకు పంచాయతీ అకౌంట్లకు జమయ్యాయి. ఆ నిధులతో గ్రామపంచాయతీల్లో ఇప్పటికే చేసిన పనుల బిల్లులతోపాటు అత్యవసర పనులు చేపట్టేందుకు పాలకవర్గాలు సిద్ధమయ్యాయి. ఆ నిధుల వినియోగానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటీవల వరకు జిల్లాలోని అనేక గ్రామాల్లో పలు రకాల పనులు చేపట్టి బిల్లులు రాకపోగా, అత్యవసర పనులు చేసేందుకు కూడా చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఒక్కొక్క పంచాయతీకి జనాభాను బట్టి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు నిధులు జమయ్యాయి. అయితే ఆ నిధులు పంచాయతీ అకౌంట్లలో జమకావడంతో సత్వరమే పనులు చేపట్టేందుకు చాలావరకు సర్పంచ్‌లు సిద్ధం కాగా కొంతమంది పాత బిల్లులు చేసుకునేందుకు చూస్తున్నారు. కొందరు అత్యవసర సమయంలో పంచాయతీలకు అవసరమైన లైట్లు, బ్లీచింగ్ వంటివి కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ ఆ బిల్లులను ఎంబుక్ చేయడం లేదు. మరోవైపు గతంలో చేసిన పనులకు కూడా ఇంజనీరింగ్ అధికారులు ఎంబుక్‌లు చేసేందుకు నిరాకరిస్తున్నట్లు సమాచారం.

ఈసారి కూడా అంతేనా

గ్రామ పంచాయతీలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధులతో ఈసారి కూడా కొంత మొత్తాన్ని విద్యుత్ చార్జీలు చెల్లింపులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో జరిగిన విధంగానే ఈసారి కూడా అదేవిధంగా జరుగుతుందా? అన్న అనుమానాలు పాలకవర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని అనేక గ్రామపంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వారికి కూడా ఆర్థిక సంఘం నిధుల ద్వారా జీతాలు చెల్లిస్తే ఇక పంచాయతీల్లో నిధులు ఉండవని పాలకవర్గాలు చెప్తున్నాయి. ఏదిఏమైనా పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించి ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు ఇస్తేనే ఆ నిధుల వినియోగం ఎలాగన్నది తెలిసే అవకాశం ఉంటుంది.

సొసైటీల్లో సభ్యుల కుదింపు

ఉత్తర్వులు జారీచేసిన జేసీ.. వ్యతిరేకిస్తున్న రైతులు


పీడీసీసీ బ్యాంక్ కార్యాలయం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 9 : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యుల సంఖ్యను కుదించేందుకు రంగం సిద్ధమైంది. సొసైటీల్లో సభ్యులను తొలగించేందుకు సొసైటీల అధికార పర్సన్ ఇన్‌చార్జీ కమిటీలను ఆదేశిస్తూ జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యుల తొలగింపు ప్రక్రియను ఈనెల 10వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో పీఏసీలను ఆదేశించారు. దీనిపై రైతులు భగ్గుమంటున్నారు.

భూమిలేని రైతుల పేర్లు తొలగించాలి

సొసైటీ సభ్యుల్లో భూమి లేనివారు, సేవలను వినియోగించుకొని వారిని సభ్యత్వం నుంచి తొలగించమన్నారు. కేవలం భూములు ఉన్న రైతులు, కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న వారిని మాత్రమే సభ్యులుగా కొనసాగించమన్నారు. జిల్లాలోని 93 సొసైటీల్లో 3.22 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో మెజార్టీ సభ్యులకు భూమి లేదు. కౌలుకు భూమి తీసుకుని సాగు చేసేవారికి భూయజమానులు రాతపూర్వకంగా ఎటువంటి పత్రాలు ఇవ్వకపోవడంతో ప్రస్తుతం వారు కూడా సొసైటీల్లో సభ్యత్వం కోల్పోవాల్సి వస్తోంది. సొసైటీల్లో లావాదేవీలు నిర్వహించని వారిని గుర్తించి ఇన్‌యాక్టివ్ సభ్యులుగా భావించి వారిని కూడా తొలగించమన్నారు.

కేవైసీ లేని వారు ఔట్

సొసైటీ సభ్యులుగా కొనసాగుతూ కేవైసీ (నో యువర్ కస్టమర్) వివరాలు లేని వారిని కూడా సొసైటీ నుంచి సభ్యత్వం తొలగిస్తున్నారు. సొసైటీలో కేవలం రూ.10 షేరుధనంతో కొనసాగుతున్న వారి కేవైసీ వివరాలు సొసైటీల్లో అందుబాటులో లేవు. ప్రస్తుతం సొసైటీల కంప్యూటరీకరణ జరుగుతుంది. అక్టోబరు 2 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో సొసైటీల్లో సభ్యుల వివరాలన్ని కంప్యూటరీకరించాలంటే అందరి కేవైసీ వివరాలు అవసరం. ఈ వివరాలు లేకపోతే కంప్యూటర్ డీసీటీ పోర్ట్‌లో వారి పేర్లు నమోదు కావు. ఈ నేపథ్యంలో సొసైటీల నుంచి వీరి సభ్యత్వాలు తొలగింపునకు ఉత్తర్వులు ఇచ్చారు.

సభ్యుల ఆగ్రహం

సొసైటీల నుంచి సభ్యులను తొలగించే ప్రక్రియపై రైతులు మండిపడుతున్నారు. సభ్యులను తొలగించాలంటే మహాజనసభలో సరైన కారణాలతో తీర్మానం చేయాలి. ఆ తర్వాత సభ్యులకు వ్యతిరేకంగా నోటీసులు జారీచేసి వారి వివరణ తీసుకున్న తర్వాతే తొలగించాలి. అయితే ప్రస్తుతం కేవలం మహాజనసభ తీర్మానంతోనే వీరిని తొలగిస్తున్నారు. దీని వల్ల కోర్టు కేసులు వస్తాయని సొసైటీ సీఈవోలు భయపడుతూ సభ్యులను తొలగించేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సొసైటీ మహాజనసభలో వీరిని అనామత్తు కింద పెట్టి వారు కేవైసీ ఇచ్చి సభ్యునిగా కొనసాగించేందుకు అభ్యర్థిస్తే కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే నాటికి సొసైటీల్లో ఎంత మంది సభ్యులు మిగులుతారో వేచి చూడాల్సి ఉంది.

లబ్ధిదారుడు కోరిన చోటుకు పింఛన్ బదిలీ

ఆన్‌లైన్ ద్వారా అవకాశం కల్పించిన ప్రభుత్వం

తొలగనున్న పింఛన్‌దారుల ఇబ్బందులు

నూరుశాతం పంపిణీకి ప్రభుత్వం చర్యలు

ఒంగోలు నగరం, సెప్టెంబరు 9 : రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిపొందుతున్న వారు ఇక నుంచి కోరిన చోటనే పింఛన్ తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఇక నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులు పింఛన్లను తమకు ఇష్టమైన చోటకు బదిలీ చేసుకోవచ్చు. జిల్లాలోని ఇతర మండలాలకు గాని, రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు గాని మార్చుకుని తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. రాష్ట్రంలోని చాలామంది పింఛన్‌దారులు తమ సొంతూర్లకు దూరంగా ఉంటున్నారు. ప్రధానంగా వృద్ధులు తమ పిల్లల వద్ద ఉంటున్నారు. వీరు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము కోసం వ్యయప్రయాసలకోర్చి సొంత గ్రామాలకు వచ్చి తీసుకుంటున్నారు. ఇలా ప్రతినెలా వచ్చి సొమ్ము తీసుకోవాల్సిరావటంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది దూరం నుంచి రాలేక ఒక్కో నెలలో పింఛన్ సొమ్మును పొందలేకపోతున్నారు. ప్రభుత్వం మాత్రం నూటికి నూరుశాతం పింఛన్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు ఈ కారణాల వలన 99శాతం వరకే పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. నూటికి నూరుశాతం పంపిణీ కావాలంటే లబ్ధిదారులు ఎక్కడ నివాసం ఉంటుంటే అక్కడే పింఛన్ అందుకునేలా చర్యలు చేపట్టింది. దీంతో వచ్చేనెల నుంచి నూటికి నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉంది.

సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి

లబ్ధిదారులు ముందుగా తాము పింఛన్ పొందుతున్న సచివాలయాన్ని సంప్రదించి అక్కడి నుంచి ఎక్కడికి పింఛన్‌ను మార్చుకోవాలనుకుంటున్నారో ఆ వివరాలను తెలియజేయాల్సి ఉంది. బదిలీ కోరుకునే గ్రామం, సచివాలయం పేరును నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్ జిరాక్స్ కాపీ, పింఛన్ పొందుతున్న ఐడీని చూపించాలి. పింఛన్ బదిలీ మండలపరిధిలో అయితే వెంటనే జరిగిపోతుంది. అదే ఇతర జిల్లాకు అయితే జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ పీడీ లాగిన్ నుంచి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కాగా జిల్లాలో ప్రస్తుతం 2,89,096 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 1,57,116, వితంతు 67,913, దివ్యాంగులు 33,590, ఒంటరి మహిళ 7,808, చర్మకారులు 5,339, డప్పు కళాకారులు 4,682, మత్స్యకారుల 2,530, చేనేత కార్మికులు 1,811, కల్లు గీత కార్మికులు 246, హిజ్రాలు 90, కళాకారులు 60, అభయహస్తం 4872, అమరావతి ల్యాండ్స్ పూర్ 5, సీకేడీయూ 186, సీకేడీయూ ప్రయివేట్ 336, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు 2,490, మాజీ సైనికులు 22మంది నెలవారీ ప్రభుత్వం నుంచి పింఛన్లు పొందుతున్నారు. వీరికి పింఛన్లు అందజేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతినెలా రూ.123కోట్లకుపైగా నిధులను విడుదల చేస్తోంది. వీరిలో అనేకమంది లబ్ధిదారులు ఇతరచోట్ల నివాసం ఉంటూ పింఛన్ సొమ్ము కోసమే సొంతూరికి వస్తున్నారు. ఇకపై లబ్ధిదారులు ఇలాంటి ఇబ్బందులు పడకుండా వారు ఉండే ప్రాంతానికే పింఛన్‌ను మార్చుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

ఉచిత ఇసుక విధానం క్రమబద్ధీకరణ

కలెక్టర్ అన్సారియా


మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : ఉచిత ఇసుక విధానాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఇసుక రవాణా చేసే లారీ యజమానులు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సోమవారం జిల్లా ఇసుక సమన్వయ శాఖ అధికారులు, లారీ యజమానులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధాన పాలసీపై వివరించారు. ఈ విధానంలో కొత్త మార్గదర్శకాల మేరకు పంపిణీ విధానం ఉంటుందన్నారు. పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో ఇసుకను అందజేస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా లారీ యజమానులు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 70 వాహనాలు రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. ఆయా వాహన యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎంప్యానల్ చేసుకోవాలన్నారు. నూతన ఇసుక విధానం ద్వారా ప్రజలకు మేలు జరిగేలా సహకరించాలన్నారు. లారీ, టిప్పర్ల కెపాసిటీని బట్టి ధరలు నిర్ణయిస్తామని కలెక్టర్ తెలిపారు. లారీలు ఇసుక కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోగానే ట్యాగ్ చేసిన వాహనదారుని మొబైల్ నెంబర్‌కు టైం, స్లాట్ వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా లారీ యజమానులు ఇసుక రవాణాకు సంబంధించి చార్జీలతోపాటు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. సమావేశంలో మైనింగ్ డీడీ జగన్నాథరావు, ఇరిగేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, మార్కాపురం మైనింగ్ ఏడీ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

తల్లి చెంతకు చంటిబిడ్డ


చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ పీడీ హేన సుజన్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 9 : నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో దొరికిన మూడు నెలల పసికందును సోమవారం ఐసీడీఎస్ అధికారులు తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు మూడు నెలల పసికందును బస్టాండ్‌లో వదిలి వెళ్లారు. సాయంత్రం వరకు చూసినా ఆ బిడ్డ కోసం ఎవరూ రాకపోవడంతో సమాచారం అందుకున్న జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్ పోలీసులకు సమాచారం అందజేసి ఆ బిడ్డను శిశు గృహకు తరలించారు. ఈ క్రమంలో సోమవారం నెల్లూరుకు వచ్చిన పసికందు తల్లిదండ్రులు ఉలవపాడు మండలం కరేడుకు చెందిన ఈగ రమాదేవి, భర్త సుధాకర్‌లు తమ బిడ్డ కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆరా తీశారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది వారిని విచారించి ఐసీడీఎస్ అధికారుల వద్దకు పంపారు. వారిని ఐసీడీఎస్ అధికారులు విచారించగా తన బిడ్డను ఆర్టీసీ బస్టాండ్‌లో బల్లపై పడుకోబెట్టి తాను తలతిరిగి పడిపోయనని, స్పృహ వచ్చాక బిడ్డ కనిపించకపోవడంతో ఆత్మకూరులోని బంధువుల ఇంటికి వెళ్లానన్నారు. టీవీల్లో వచ్చిన వార్తలను చూసిన బంధువులు తన బిడ్డ నెల్లూరులో ఉందని చెప్పడంతో ఇక్కడికి వచ్చాననడంతో వారు శిశు గృహలో ఉన్న బిడ్డను చూపించగా వారి బిడ్డగా గుర్తించారు. దీంతో ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ వారికి పసికందును అప్పగించారు.

ప్రాణాలు తీస్తున్న రోడ్డు ప్రమాదాలు

- కానరాని నివారణ చర్యలు
- క్రాస్ రోడ్ల వద్ద కనిపించని వీధి దీపాలు
- పనిచేయని సీసీ కెమెరాలు
- హైవేపై మొక్కుబడి పనులు



జాతీయ రహదారిలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ సమీపంలో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన డ్రమ్ములు, వేటపాలెం క్రాస్ వద్ద రోడ్డు మార్జిన్‌కు చేరిన డ్రమ్ములు, హెచ్చరిక బోర్డులు, 216 హైవే వేటపాలెం క్రాస్ వద్ద కనిపించని ప్రమాద నివారణ డ్రమ్ములు

చీరాల, సెప్టెంబరు 9 : 216 జాతీయ రహదారిలో రోజు, రోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతన్నాయి. ఎక్కువ సందర్భాలలో వాహన చోదకులు ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వస్తోంది. ఉప్పుగుండూరు టోల్‌ప్లాజా నుంచి చీరాల మండలం ఈపురుపాలెం వై జంక్షన్ వరకు చినగంజాం, వేటపాలెం, చీరాల మండలాల పరిధిలో పలు గ్రామాల వద్ద రోడ్డు క్రాసింగ్స్ ఉన్నాయి. ఆ క్రాసింగ్స్ వద్దనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అందులో వేటపాలెం మండల పరిధిలో వేటపాలెం, అక్కాయిపాలెం, రామాపురం క్రాస్ రోడ్ల వద్ద ఎక్కువగా ప్రమాదలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ఎస్పీగా పనిచేసిన మల్లికగర్గ్ రోడ్డు ప్రమాదాల నివారణకు పలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డేగా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఆ క్రమంలో హైవే నుంచి గ్రామాలకు వెళ్లే క్రాసింగ్స్ వద్ద ఇసుక డ్రమ్ములను జిగ్, జాగ్‌గా ఏర్పాటు చేయించారు. దీంతో ఆ క్రాసింగ్స్ వద్దకు వచ్చే వాహనాలు ఎంత స్పీడుగా వస్తున్నా వేగం తగ్గించాల్సి వచ్చేది. దీంతో ప్రమాద ఘటనల సంఖ్య కొంత మేర తగ్గింది. అయితే కొందరు వాహన చోదకులు హైవేలో ఏర్పాటుచేసిన ఇసుక డ్రమ్ములను సైతం గుద్దిన సందర్భాలు ఉన్నాయి.

ప్రస్తుత పరిస్థితి ఏంటి?

216 జాతీయ రహదారిలో గతం ఏర్పాటు చేసిన ఇసుక డ్రమ్ములు కొన్ని ప్రదేశాల్లో కనిపించటం లేదు. ప్రధానంగా వేటపాలెం, అక్కాయిపాలెం క్రాసింగ్స్ వద్ద డ్రమ్ములు రోడ్డు మార్జిన్‌లోకి చేరాయి. ఈ ప్రాంతంలోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే రోడ్డు క్రాసింగ్స్ వద్ద పలుచోట్ల కాంతివంతమైన వీధి దీపాలు ఉండటం లేదు. దిచక్ర వాహనచోదకులు, ఆటోలు, కార్లు, లారీలు లాంటి వాహనాల్లో కొందరు కొన్ని సమయాల్లో రాత్రి వేళ్లలో లైట్లు లేకుండా వాహనాలు నడుపుతున్నారు. ఆ సమయాల్లో క్రాసింగ్ వద్ద జరిగే ప్రమాదాలు ఎక్కువగా ఉంటున్నాయని స్థానికులు చెప్తున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు

ఒక వైపు రోడ్డ భద్రత, మరో వైపు అపరాద పరిశోధనకు ఎంతో కీలకంగా ఉండే సీసీ కెమెరాలు పలు చోట్ల పనిచేయటం లేదు. దీంతో ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో సంఘట పూర్వాపరాలు తెనుకునేందుకు పోలీసులకు కష్టతరం అవుతుంది. గతంలో వాడరేవు జంక్షన్ వద్ద ఓ కారు ఓ బాలుడిని గుద్దేసిన సంఘటనకు సంబంధించి అప్పట్లో అక్కడున్న సీసీ కెమెరా పుటేజ్ ద్వారా దర్యాప్తు వేగవంతం అయ్యింది.

ఏం చేయాలి

రోడ్డు క్రాసింగ్స్ వద్ద కాంతివంతమైన లైట్లు ఉండాలి. సీసీ కెమెరాలు పక్కాగా పనిచేసేవిధంగా చర్యలు చేపట్టాలి. హైవే నుంచి గ్రామాలకు రాకపోకలు సాగించే క్రాస్ రోడ్ల వద్ద గతంలో మాదిరిగా జిగ్‌జాగ్‌గా ఇసుక డ్రమ్ములను ఏర్పాటు చేయాలి. ఇంకా మెరుగైన చర్యలు ఏమన్నా ఉంటే శాఖపరంగా అమలు చేయాలి. వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పొట్టిసుబ్బయ్యపాలెంతీరంలో పర్యటిస్తున్న ఎస్ఐ, గజ ఈతగాళ్లు

నిమజ్జనంలో జాగ్రత్తలు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 9 : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వినాయక నిమజ్జనాలలో జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన సిబ్బంది, గజఈతగాళ్లతో పొట్టి సుబ్బయ్యపాలెం సముద్రతీరంలో పర్యటించారు. వానలను దృష్టిలో పెట్టుకొని తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలు అవసరమని ఎస్సై తెలిపారు. మత్స్యకారులకు అవగాహన కల్పించారు. పర్యాటకులు వాతావరణం యథాస్థితికి వచ్చేవరకు తమ పర్యటనలను వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు.

నేడు పర్చూరులో జాబ్ మేళా

పర్చూరు, సెప్టెంబరు 9 : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 9గంటలకు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శేషుకుమారి సోమవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ మేళాలో గోదావరి కోపరేటివ్ సొసైటీ, కృష్ణపట్నం పోర్టు, రాయల్ మెరైన్, రిలాయిన్స్ టెండ్స్, కళ్లం టెక్స్‌టైల్స్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆ సంస్థలకు సంబంధించి 120కి పైగా ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్హత, నైపుణ్యతను బట్టి నెలకు రూ10,000 నుంచి రూ.20వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ. బీటెక్, డిప్లొమా, బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ అభ్యర్థులు అర్హులు అన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

దాడిపై కేసు

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 9 : యద్దనపూడి మండలం చిమటావారిపాలెం గ్రామానికి చెందిన గనిపివెట్టి శ్రీనివాసరావు తనపై దాడిచేసి గాయపరచారని చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డీ రత్నకుమారి తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శ్రీనివాసరావుకు అదే గ్రామానికి చెందిన గండు శ్రీనుకు కొంత కాలం నుంచి పొలం తగాదాలు ఉన్నాయి. దీనిపై బుధవారం సర్వే చేయాల్సి ఉండగా, ఆదివారం రాత్రి శ్రీనివాసరావుపై గండు శ్రీను, మరో నలుగురు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు చిలకలూరిపేట, తర్వాత గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

యాచకురాలిగా అనుమానిస్తున్న పోలీసులు

చీరాలటౌన్, సెప్టెంబరు 9 : సోమవారం అర్ధరాత్రి చీరాల - వేటపాలెం మధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. వాహనం వేగంగా ఢీకొనడంతో ముఖం ఛిద్రమై గుర్తు పట్టలేని పరిస్థితిలో ఉంది. దీంతో సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆమె అర్ధరాత్రి జాతీయ రహదారిలో ఉండడంతో యాచకురాలిగా పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

దాతల సాయం అభినందనీయం



వైద్యాధికారులకు దాతలు అందజేసిన మెటీరియల్

చినగంజాం, సెప్టెంబరు 9 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు కట్లు కట్టుటకు ఉపయేగించే స్టెరైజేషన్‌ను సోమవారం వైద్యాధికారులకు అందజేశారు. చినగంజాం గ్రామానికి చెందిన ముచ్చర్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య యశోదమ్మ, కుమార్తె, అల్లుడు వెంకటసంధ్యారాణి, నూనె సుబ్రమణ్యం రోగులకు కట్లు కట్టే స్టెరైజేషన్, కుట్లు వేసే ఇన్స్ట్రుమెంట్‌లను వైద్యాధికారులకు అందజేశారు. దాతలు అందజేసిన పరికరాలతో మెరుగైన సేవలు చేయటకు ఎంతగానో ఉపయోగపడతాయని వైద్యాధికారి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం రోజు కలెక్టర్ ద్వారా ఉత్తమ అవార్డు తీసుకున్న ఎంఎస్‌వో సుబ్బారావుకి దాతలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారు పి.సాయిశ్రీచరణ్, సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ పాత బకాయిలపై పరిశీలన



తిమ్మాయపాలెం లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ

అద్దంకి, సెప్టెంబరు 9 : ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకం ద్వారా 2015-19 మధ్య ఇళ్ల నిర్మాణం చేసుకొని బిల్లులు బకాయిలు ఉన్న లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామీణ ప్రాంతాలలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకం ద్వారా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పలువురు లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో కొంతమంది లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులను నిలిపివేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం లబ్ధిదారుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. హౌసింగ్ ఏఈ కిరణ్ సోమవారం అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంలో లబ్ధిదారుల వివరాలను సేకరించారు. అన్ని గ్రామాలలో సర్వే చేసి ఆ వివరాలను ప్రభుత్వానికి పంపనున్నట్లు ఏఈ తెలిపారు. టీడీపీ నేతలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



రేణంగివరంలో మినుమును పరిశీలిస్తున్న ఏవో

పసుపు తెగులు నివారణపై అవగాహన

పంగులూరు, సెప్టెంబరు 9 : మినుము పైరును ఆశించిన పసుపు తెగులు నివారణకు తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని రేణంగివరంలో సోమవారం రైతులు సాగు చేస్తున్న మినుము పైరును ఏవో సుబ్బారెడ్డి రైతులతో కలసి పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో సాగులో ఉన్న మినుము పైరు 35 నుంచి 65రోజుల దశలో ఉందన్నారు. మినుము పైరుకు అక్కడక్కడ రసం పీల్చే పురుగులు తెల్లదోమ ఆశించినట్లు గుర్తించమన్నారు. దీని కారణంగా ఆకులు పసుపు రంగులో మారుతున్నాయని, దీని నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని రైతాంగినికి సూచించారు.

15లోగా ఈ-పంట నమోదు చేయాలి

బల్లికురవ, సెప్టెంబరు 9 : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా ఈనెల 15వ తేదీలోపు ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. సోమవారం మండలంలోని కొనిదెన గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ గడువు 15వ తేదీలోపు ముగుస్తుందని రైతులు సాగు చేసిన ఏ పంటలైనా వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి వెంటనే పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వ రాయితీలు వర్తించవు అని అమె రైతులకు సూచించారు.

గోశాలకు తవుడు బస్తాల అందజేత



తవుడు బస్తాలను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 9 : అద్దంకిలోని వాసవీ నగర్‌లోని హరిహర గోకులంలోని గోవులకు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రూ.10వేలతో 6 తవుడు బస్తాలను అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. గోవులను మనం సంరక్షించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ మురళీసుధాకరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళి కృష్ణ, సుబ్రహ్మణ్యం, ఏ. శ్రీనివాసరావు, గోశాల నిర్వహకుడు సుబ్బారావు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్త హీనతతో బాధపడుతున్న ఓ.వెంకాయమ్మకు ఏ పాజిటివ్ రక్తం అవసరంకాగా చేబ్రోలు పాండురంగారావు ద్వారా రక్తాన్ని సేకరించారు.

యాజమాన్య పద్ధతులపై సూచనలు

చినగంజాం, సెప్టెంబరు 9 : చినగంజాం ప్రాంత రైతులకు కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ జి.ప్రసాద్‌బాబు సోమవారం యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇచ్చారు. డిజిటల్ ఫామ్ స్కూల్‌లో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్టీ లోకేషన్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలు అందజేశారు. శాస్త్రవేత్త వరిలో నేరుగా విత్తే సాలుసరి పద్ధతిని పాటించడం ద్వారా నారు పెంచే అవసరం లేకుండా వరి పండించుకోవచ్చునని తెలిపారు. దీని ద్వారా కూలీల, నారు నాటే ఖర్చు కూడా తగ్గించుకోవచ్చనని తెలిపారు. యాజమాన్య పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. వరి పంటకు సంబంధించి రైతులు అడిగిన సందేహాలకు, ప్రశ్నలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ యాకోబు, క్షేత్ర విస్తరణ సిబ్బంది రత్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల సాయం

ముందుకొచ్చిన కిరాణా మర్చంట్స్ అసోసియేషన్

చీరాల, సెప్టెంబరు 9 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపు మేరకు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం నిత్యావసర సరుకులు సమకూర్చారు. సుమారు 1000 మందికి సరిపడా నిత్యావసర సరుకులను వాహనాల్లో విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా బాధితులకు సహకారం అందిస్తున్నామన్నారు.



జక్కంపూడి ప్రాంతంలో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చంద్రబాబు సారథ్యంలో ముందుకు

వరద బాధితులకు సాయం అందించేందుకు సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. సోమవారం విజయవాడ జక్కంపూడి ప్రాంతంలో వరద బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్‌జీ కంపెనీ గృహోపకరణాల మరమ్మతులు ఉచితంగా చేసేందుకు, స్పేర్ పార్టులు 50 శాతం రాయితీపై ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. స్థానికులకు భరోసా ఇచ్చారు.

విరాళాల సేకరణ

పంగులూరు : పంగులూరులో విజయవాడ వరద బాధితుల సహాయార్థం గ్రామస్థులు విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఆదివారం వ్యాపార సముదాయాలు, నివాస గృహాల వద్దకు వెళ్లి వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సాయమందించాలని సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు, బాచిన శ్రీనివాసరావు (దేవుడి శ్రీను), మరి కొందరు జట్టుగా ఏర్పడి విరాళాల సేకరణ చేస్తున్నారు. లక్ష రూపాయల విరాళాలను సేకరించి బాధిత కుటుంబాలకు సాయం చేయాలనే లక్ష్యంతో సేకరిస్తున్నట్లు రామాంజనేయులు తెలిపారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సాయం అందించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో వడ్డెంపూడి హనమంతరావు, పఠాన్ అబ్దుల్ రఫీ, చిలుకూరి మాధవి, బాచిన కృష్ణ పాల్గొన్నారు.

రూ.15వేల సాయం

అద్దంకిటౌన్ : విజయవాడ వరద బాధితుల కోసం అద్దంకిలోని రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి తాళ్లూరి బాబూరావు, రాజేశ్వరి రూ.15వేల చెక్కును సోమవరం సీపీఎం మండల పార్టీ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లుకు అందజేశారు. విజయవాడ వరద బాధితుల కోసం దాతలు ముందుకు రావాలని, తమ వంతు సహకారం అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ తరఫున దాతలకు అభినందనలు తెలియజేశారు.



సరుకులతో విజయవాడ బయలుదేరిన వాహనం, పంగులూరులో సాయం అందిస్తున్న వృద్ధురాలు, చెక్కును అందజేస్తున్న రాజేశ్వరి

టీడీపీ నేతల కుటుంబాలను పరామర్శించిన మంత్రి

మార్టూరు, సెప్టెంబరు 9 : ఇటీవల ఆకస్మికంగా మార్టూరు గ్రామంలో మృతి చెందిన ఇద్దరు టీడీపీ నేతల కుటుంబ సభ్యులను సోమవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. రెండురోజుల కిందట బల్లికురవ మాజీ సర్పంచ్, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు పావులూరి సత్యనారాయణ మృతి చెందగా, నాగరాజుపల్లి రోడ్‌లో ఉన్న అతని ఇంటికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే శ్రీ విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు తగెర్ల పెద్దబ్బాయి మృతిచెందగా వారి కుటుంబసభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించారు. ఆయనతోపాటు బల్లికురవ, మార్టూరు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఉన్నారు.



సత్యనారాయణ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న గొట్టిపాటి

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ఇంకొల్లు, సెప్టెంబరు 9 : ఉపాధ్యాయులు అంకితభావంతో విధు లు నిర్వహించాలని ఎంఈవో శ్రీనివాసరావు సూచించారు. వనరుల కేంద్రంలో సోమవారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వ విధి విధానాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి నిబంధనలు తప్పనిసరి

బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

పర్చూరు, సెప్టెంబరు 9 : గణేష్ నిమజ్జనానికి పోలీసులు సూచించిన నిబంధనలు తప్పక పాటించాలని బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు అన్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న వినాయక విగ్రహాలను నిత్యం పరిశీలించాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. సోమవారం యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి గ్రామంలో నమోదు అయిన ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో భాగంగా ఆయన పర్చూరు వచ్చారు. పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులతో మా ట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణే లక్ష్యంగా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించటం జరిగిందన్నారు. ఆయనతోపాటు మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల, జనగణన ప్రాతిపదికన హక్కులు కల్పించాలని బీసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం చీరాల అంబేడ్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు, నామినేటెడ్ పదవులను కల్పించాలని వారన్నారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కొలువుదీరిన భారీ గణనాథులు

- ప్రత్యేక పూజలు, ప్రసాదాల పంపిణీ
- ఉత్సాహంగా నిమజ్జనాలు


అద్దంకి, సెప్టెంబరు 9 : మండపాలలో ఉన్న వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అద్దంకి పట్టణంలో టీడీపీ నేతలు, తెలుగు యువత ఆధ్వర్యంలో పలు కాలనీలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. గతంలో కంటే రెట్టింపు సంఖ్యలో టీడీపీ నేతలు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అత్యధిక చోట్ల భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. దామావారిపాలెం, కాకానిపాలెం, నర్రావారిపాలెం, గాంధీ బొమ్మ సెంటర్, రామ్‌నగర్, భవానీసెంటర్, అభ్యుదయనగర్ తదితర ప్రాంతాలలో పెద్ద పెద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. పూజల అనంతరం పలు రకాల ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేస్తున్నారు. నాగులపాడులో గొట్టిపాటి యూత్, తెలుగుయువత ఆధ్వర్యంలో భారీ విగ్రహాలు కొలువుదీరాయి. శింగరకొండ వద్ద భవనాసి చెరువులో సోమవారం కొన్ని గ్రామాల నుంచి వచ్చిన వినాయక వి గ్రహాల నిమజ్జనం చేశారు. బుధవారం నుంచి నిమజ్జనోత్సవాలు జరుగనున్నాయి.


బల్లికురవ : పలు గ్రామాలలో వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన వేడుకను సోమవారం ఉత్సాహంగా సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. వీర్ల కొండ వద్ద గత మాజీ మంత్రి ముక్కు కాశీరెడ్డికి చెందిన శ్రీ శ్రీనివాస గ్రానైట్ క్వారీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడిని కార్మికులు మల్లాయపాలెం, బల్లికురవ గ్రామాలలో గ్రామోత్సవం నిర్వహించి అనంతరం ఏబీసీ కాలువలో నిమజ్జనం చేశారు. బల్లికురవ పోలేరమ్మ దేవాలయం వద్ద యువత ఏర్పాటు చేసిన గణనాథుడిని వైభవంగా నిమజ్జనం చేశారు. గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.



నాగులపాడులో గొట్టిపాటి యూత్ ఏర్పాటు చేసిన వి గ్రహం, వీర్లకొండ నుంచి నిమజ్జనానికి తరలుతున్న గణపతి

ఇంకొల్లు : మండలంలో వినాయక చవితి సందర్భంగా మండపాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు భక్తులు మూడోరోజు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. రాత్రి 10 గంటల వరకు వినాయక విగ్రహాల వద్ద భక్తులు భజనలు చేసిన అనంతరం ప్రసాదాలను పంచిపెట్టారు. ఇంకొల్లు ముస్లిం కాలనీలో చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద చిన్నారులు పూజలు చేస్తున్నారు.





'సోమశిల'లో 46.678 టీఎంసీల నీరు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం 18,990 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 46.678 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 550, కండలేరుకు 4000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నారు.

ఉండ్రాలయ్యా..

ఇక ఉంటామయ్యా!

అట్టహాసంగా గణనాథుల నిమజ్జనం

సముద్రతీరం, పెన్నా పరివాహకంలో కోలాహలం

మూడు రోజులపాటు పూజలందుకున్న గణనాథుల ప్రతిమలను భారీ ఊరేగింపులతో సోమవారం నిమజ్జనం చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించిన వాహనాలలో గణనాథులను కొలువుదీర్చి డప్పుల వాయిద్యాలు.. వివిధ కళాకారుల నృత్యాలు... బాణసంచా పేలుళ్ల, డిజే పాటల నడుమ యువత కేరింతలు కొడుతూ అట్టహాసంగా ఊరేగింపు జరిగింది. జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలు, పెన్నా నదీ పరివాహకం, వాగులు, వంకలు, చెరువులు ఇతర జలవనరులలో అశేష భక్తజనం నడుమ ప్రతిమలను గంగాజలంలో కలిపారు. నెల్లూరు నగరంలో దాదాపు 200 ప్రతిమలకుపైగా గణేష్ ఘాట్‌ల వద్ద క్రేన్‌ల సాయంతో నిమజ్జనాలు జరిగాయి. నగర పాలక సంస్థ, పోలీసు ఇతర శాఖల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. గణేష్ నిమజ్జనాలు తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు ఘాట్ వద్దకు చేరారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందుకూరుపే మండలం మైపాడు, టీపీగూడూరు కొత్తకోడూరు, కావలి మండలం తుమ్మలపెంట, ఉలవపాడు మండలం అలగానిపాళెం తదితర తీరప్రాంతాలు నిమజ్జనానికి వచ్చిన గణనాథులతో నిండిపోయాయి.

- ఆంధ్రజ్యోతి బృందం



కావలి : తుమ్మలపెంట తీరానికి తరలి వచ్చిన గణనాథులు



అందరూ జాగ్రత్తగా ఉండండి.. తుమ్మలపెంట తీరంలో పోలీసుల పహారా



నెల్లూరు : గణేష్ ఘాట్ వద్ద వినాయక ప్రతిమలను గంగలో కలుపుతున్న క్రేన్



సంగం : క్రేన్ సాయంతో పెన్నా నదిలో విఘ్నేశ్వరుడి ప్రతిమను నిమజ్జనం చేస్తూ..



కావలి పట్టణంలో కళాకారుల విన్యాసం

నిమజ్జనంలో అపశ్రుతి

కావలి రూరల్ : వినాయక నిమజ్జన వేడుకలో అపశ్రుతి చోటు చేసుకుంది. ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. కావలిలోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి ప్రతిమను సోమవారం ఊరేగింపు అనంతరం ట్రాక్టర్‌లో తమ్మలపెంట సముద్ర తీరంలో నిమజ్జనానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని కొనదిన్నె సమీపంలో గతుకుల రోడ్డుపై ట్రాక్టర్ కుదుపులకు ట్రక్ లో ఉన్న మొగిలి రమేష్ (30) అదుపు తప్పి కింది పడ్డాడు. దీంతో ట్రాక్టర్ ట్రాలీ టైరు రమేష్‌పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, ఇందిరానగర్‌కు చెందిన శ్రీనివాసులు, మేరి దంపతులకు రమేష్‌తోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ మృతితో ఇందిరానగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



ఉదయగిరి : చుక్కనీరు లేని నేలటూరు చెరువు

నిమజ్జనానికి నీరేది!?

తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి వనరులు అడుగంటడంతో గణనాథుల నిమజ్జనానికి కష్టాలు తప్పడంలేదు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఉత్సవ కమిటీలు సుమారు వెయ్యికిపైగా ప్రతిమలను ఏర్పాటు చేశాయి. పూజలు అందుకున్న ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు చెరువులు, వాగులు, వంకల్లో నీరు లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాక నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. గండిపాళెం జలాశయంలో అరకొరగా నీరున్నా అక్కడ విగ్రహాల నిమజ్జనం నిషేధం. నీటి వనరులు, సముద్ర ప్రాంతానికి వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయాలంటే వ్యయప్రయాసాలతో కూడుకోవడంతో ఇబ్బందులు తప్పవు.

- ఉదయగిరి రూరల్



సత్తర పట్టు హైరెస్సా!

దిగుబడి లేదు..

ధర అంతకన్నా లేదు!



పాతాళపల్లి వద్ద రోడ్డు పక్కన అరబెట్టిన వేరుశనగ మొక్కలు

అనంతసాగరం : ఈసారి వేరుశనగకు ఆశించిన ధర, దిగుబడి లేకపోవడంతో రైతన్నలో ఆందోళన నెలకొంది. కనీసం పెట్టుబడులు అయినా రాబట్టుకొనే ప్రయత్నంలో ఉన్నారు. అనంతసాగరం మండలంలోని పాతాళపల్లి, గోవిందమపల్లి, కమ్మవారిపల్లి, పీకేపాడు, చిలకలమర్రి, గౌరవరం గ్రామాల్లో సుమారు 600 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. కొన్నిచోట్ల కోతలు పూర్తవగా మిగిలిన చోట్ల ఆ పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఒక ఎకరాలో వేరుశనగ సాగుకు అన్ని ఖర్చులు కలుపుకొని రూ.30 వేల నుంచి 35 వేల వరకు ఉంటుంది. అయితే, అందుకు అనుగుణంగా దిగుబడి, ధర మాత్రం ఉండటం లేదు. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల వరకు (ఒక్కో బస్తా 40 కిలోలు) దిగుబడి రావాల్సి ఉండగా 25 బస్తాలకు మించడం లేదు. గతేడాది ఇదే సీజన్‌లో బస్తా రూ.3 వేల నుంచి 3,200 పలకగా ప్రస్తుతం రూ.2200లకు మించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఈ క్రమంలో సాగుపై వెచ్చించిన ఖర్చులు కూడా రాక ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉన్నా రైతుల వద్దకొచ్చేసరికి దిగజారడంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

'నేతన్న' ఇంట వెలుగులు

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే అన్ని రకాల పింఛన్లు పెంచడంతోపాటు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించింది. తాజాగా చేనేత కార్మికులను ఆదుకునేందుకు ఉచిత కరెంటు పథకం అమలుకు నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం జీవో తేనుంది.

వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ● కూటమి ప్రభుత్వం నిర్ణయం?



సంగం, సెప్టెంబరు 9 : జిల్లాలో అధికారికంగా 6,850 చేనేత మగ్గాలు ఉండగా, అనధికారికంగా మరో రెండు వేలు వరకు ఉన్నాయి. వాస్తవానికి జిల్లాలో చేనేత కుటుంబాలు 25 వేల వరకు ఉన్నాయి. కానీ వీరంతా నేత పని గిట్టుబాటుకాక తాపీ పనులు, వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. అలాగే మరో 7వేల కుటుంబాలు చేనేత ఉప కులాల వారు ఉన్నారు. చేనేత రంగంపై ఆధారపడి 18 ఉపవృత్తుల వారు ఉన్నారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చేనేతలకు అనేక రాయితీ పథకాలతోపాటు ఆరోగ్య బీమా అమలు చేశారు. 2019లో ఎన్నికల ముందు చేనేతలకు వంద యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే, అప్పటి ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఉచిత కరెంటుతోపాటు అప్పటివరకు ఉన్న సంక్షేమ, రాయితీ పథకాలను నిలిపివేసి 'నేతన్న నేస్తం' పథకంతో సరిపెట్టింది. దీంతో చేనేతలకు ఉచిత కరెంటు అమలు మరుగున పడింది. ప్రస్తుతం విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. రూ.500 నుంచి 700 వరకు బిల్లు వస్తుండగా నేతన్నకు భారంగా మారింది.

● అమలుపై స్పష్టత కరువు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి చేనేతలకు ఉచిత కరెంటు హామీ ఇచ్చింది. అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేనేతలకు వంద యూనిట్ల ఉచిత కరెంటు అమలుకు నిర్ణయించినట్లు సమాచారం. అయితే, చేనేత కార్మికులు అందరికీ గుర్తింపు కార్డులు లేవు. గతంలో ప్రభుత్వం ఆదేశించినా సకాలంలో చేనేత, జౌళి శాఖ గుర్తింపు కార్డులు పూర్తిస్థాయిలో అందచేయలేకపోయింది. అంతేగాక వైసీపీ ప్రభుత్వం కేవలం మగ్గం ఉన్న నేత కార్మికులకే నేతన్న నేస్తం అమలు చేసింది. అందులో కూడా అనేక కొర్రీలు చూపి పథకానికి అనర్హులుగా ప్రకటించి నిలిపివేసింది. దీంతో చాలా మంది నేతన్న నేస్తానికి నోచుకోలేదు. అంతేగాక ఉప వృత్తులవారికి మొండిచేయి చూపింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 'నేతన్న నేస్తం' లబ్ధిదారులకే ఉచిత కరెంటు అమలు చేస్తుందా!? లేదా సర్వే చేసి చేనేత కార్మిలతోపాటు ఉప వృత్తులు చేసే వారికీ వర్తింపు చేస్తుందా అనేది స్పష్టత లేదు. ప్రభుత్వం జీవో విడుదల చేస్తేగాని స్పష్టత రాదని నేత కార్మికులు పేర్కొంటున్నారు. కాగా, ఉచిత కరెంటుపై తమకు ఎటువంటి సమాచారం లేదని, జీవో విడుదలైన తర్వాతే స్పష్టత వస్తుందని చేనేత,జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు.

300 యూనిట్లకు పెంచాలి

ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి చేనేత కార్మికులకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు 2019లో టీడీపీ ప్రకటించిన 100 యూనిట్లకు పరిమితం చేసేలా ఉంది. దీనివల్ల చాలా మంది నేత కార్మికులు ఉచిత కరెంటుకు అనర్హులవుతారు. 300 యూనిట్లకు అమలు చేయాలి.

- మాగం గిరిబాబు, సంగం

ఉప వృత్తులకూ ఇవ్వాలి

మగ్గం నేసేవారితోపాటు కండెలు చుట్టేవారు, అచ్చులు అతికేవారు, పొడుగు పట్టేవారు కూడా చేనేత కార్మికుల కిందకు వస్తారు. వీరంతా చేనేత ఉప వృత్తుల వారే. వైసీపీ ప్రభుత్వ మగ్గం నేసేవారికే పథకాన్ని అమలు చేసి అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వమైనా అందరికీ ఉచిత కరెంటు అమలు చేయాలి.

- జె చౌడయ్య, రాళ్లచెలిక

14 నుంచి పరిశుభ్రత కార్యక్రమాలు

● 2వ తేదీ వరకు నిర్వహణ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 : ఈ నెల 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 'స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత' పేరుతో జిల్లాలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరం నుంచి సబ్ కలెక్టరు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. స్వచ్ఛత మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు అయిన సందర్భంగా దేశవ్యాప్తంగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అమలు కోసం జిల్లాలో 15 మంది అధికారులతో ప్రత్యేక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను, బ్లాక్ స్పాట్లు గుర్తిం , విద్యార్థులు, పొదుపు సంఘాల సభ్యులు, రైతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరుల సహకారంతో శ్రమదానం ద్వారా శుభ్రపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి గాంధీ జయంతి నాడు అవార్డులు, సఫాయి మిత్రులను సన్మానించనున్నట్లు చెప్పారు. ఈ సమీక్షలో డీపీఓ సుస్మితా రెడ్డి పాల్గొన్నారు.

వీడియో రీల్స్ పోటీలు

● ఈ నెల 22 వరకు చాన్స్

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 9 : ప్రపంచ పర్యాటక దినోత్సవం (సెప్టెంబరు 27) సందర్భంగా చారిత్రాత్మక ప్రదేశాలు, ప్రముఖ ఆలయాలు, ఔన్నత్యం తెలిపేలా వీడియో - రీల్స్ రూపొందించి సెప్టెంబరు 22లోగా ఆన్‌లైన్ ద్వారా పంపాలని పర్యాటక అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు జిల్లా టూరిజం కౌన్సిల్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు పంపే వీడియోలు ఒక నిమిషం నిడివి కలిగిన రీల్స్ ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ప్రకృతి ప్రేమికులు జిల్లాలోని ఉదయగిరి, పెంచలకోన, మైపాడు, ఇసుకపల్లి, రామాయపట్నం బీచ్‌లో లైట్‌హౌస్, జొన్నవాడ మల్లి కార్జున్ స్వామి ఆలయం, నరసింహకొండ, మాలకొండ, తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, కండలేరు డ్యామ్, సోమశిల తదితర ప్రాంతాలను చిత్రీకరించి ఆన్‌లైన్‌లో పంపాలని పేర్కొన్నారు. విజేతలకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి శ్రీనివాసరావు, 98480 07024ను సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వం మారినా ఆర్‌అండ్‌బీ శాఖలో మార్పు రానంటోంది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టాలని కూటమి ప్రభుత్వం ఆదేశించినా కొంతమందిలో ఆ బాధ్యత కనిపించడం లేదు. కీలకమైన రహదారిగా నెల్లూరు-మైపాడు రోడ్డును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సదరు రోడ్డు అభివృద్ధికి గతేడాది రూ.48 కోట్లు కేటాయించింది. టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ జరిగి ఆరు నెలలు పూర్తి కావస్తోంది. మొన్నటి వరకూ ఎన్నికల కోడ్ ఉందంటూ నెట్టుకొచ్చిన అధికారులు, కాంట్రాక్టర్.. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఆ రోడ్డు పనులు మొదలుపెట్టలేదు.

నిధులున్నా నీరసం!

- కీలకమైన మైపాడు రోడ్డుకు రాజకీయ గ్రహణం
- అభివృద్ధికి రూ.48 కోట్లిచ్చిన కేంద్ర ప్రభుత్వం
- టెండర్‌లో రింగ్.. భాగం పంచుకున్న కాంట్రాక్టర్లు
- అగ్రిమెంట్ పూర్తయి ఆరునెలలైనా ప్రారంభం కాని నిర్మాణం
- అధికారులు పట్టించుకోరు.. కాంట్రాక్టర్ స్పందించరు
- ఇప్పుడు ఆ వర్క్‌ను మరొకరు తీసుకునే ప్రయత్నాలు

నెల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో మైపాడు బీచ్ ప్రధానమైంది. నెల్లూరు నగరవాసులకు కూడా ఈ బీచ్ ఒక విహారస్థలంగా ఉంటుంది. అయితే నెల్లూరు నుంచి మైపాడు వెళ్లే రహదారి మాత్రం దారుణంగా ఉంది. డెల్టా ప్రాంతాన్ని కలుపుకుంటూ వెళ్లే ఈ రహదారి ప్రస్తుతం సింగిల్ లేన్ కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నెల్లూరులో మైపాడు రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించారు. కానీ జాతీయ రహదారి నుంచి మైపాడు వరకు ఉన్న సుమారు 22 కిలోమీటర్లు మాత్రం ఇంకా ఇబ్బందికరంగానే ఉంది. దీన్ని విస్తరించి అభివృద్ధి చేస్తే మార్గమధ్యంలోని గ్రామాల ప్రజలకు, బీచ్‌కు వెళ్లే పర్యాటకులకు ఉపయుక్తంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లగానే సీఆర్ఐఎఫ్ కింద రూ.48 కోట్లు కేటాయించింది.



నెల్లూరు నుంచి మైపాడుకు వెళ్లే రోడ్డు

నాడు రింగ్.. నేడు లాగేసుకునే ప్రయత్నాలు

నెల్లూరు-మైపాడు రోడ్డుకు సంబంధించి గతేడాది చివర్లో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. మొత్తం ఐదుగురు కాంట్రాక్టర్లు ఈ వర్కు కోసం టెండర్లు దాఖలు చేశారు. అప్పటి వరకూ టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు.. ఇది కేంద్ర ప్రభుత్వ వర్కు కావడంతో బిల్లులు వస్తాయని పోటీ పడ్డారు. అయితే రివర్స్ టెండరింగ్ సమయం నాటికి అందరూ రింగ్ అయినట్లు నాడు ప్రచారం జరిగింది. 2.40 శాతం ఎక్సెస్‌కు ఓ కాంట్రాక్టర్ వర్కును దక్కించుకోవడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఐదుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేసినప్పటికీ వీరు రివర్స్ టెండరింగ్‌లో పాల్గొనలేదు. తెరవెనుక వీరంతా ఒప్పందం కుదుర్చుకొని తలా కొంత వర్కును అనధికారికంగా విభజించుకున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు గ్యారెంటీలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెబుతుండడం గమనార్హం. ఓ కాంట్రాక్టర్ పేరుపై అగ్రిమెంట్ జరగ్గా ఆ కాంట్రాక్టర్ ఖాతా నుంచి సగం బ్యాంకు గ్యారెంటీను, మరో కాంట్రాక్టర్ ఖాతా నుంచి మిగిలిన సగం మొత్తం బ్యాంక్ గ్యారెంటీను సమర్పించినట్లు సమాచారం. పోనీ అందరూ రింగ్ అయినా పనులు ప్రారంభించారా? అంటే అదీ లేదు. తాజాగా ఈ వర్కును పూర్తిగా దక్కించుకునేందుకు ఓ కాంట్రాక్టర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొదట్లో కొంతభాగం తీసుకున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పుడు మొత్తం వర్కు తనకే కావాలని పట్టుబడుతుండటంతో సమస్య జటిలమవుతున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అసలు పనులు ఎప్పుడు మొదలవుతాయన్న ప్రశ్న తలెత్తుతోంది.

మేమున్నామనీ..

వరద బాధితులకు విరివిగా విరాళాలు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 : వరదలో చిక్కుకున్న ఆపన్నహస్తంకోసం ఎదురుచూస్తున్న ఎందరో అభాగ్యులకు నెల్లూరువాసులు మేమున్నామంటున్నారు. నగదుతోపాటు ఆహార ప్యాకెట్లు, మంచినీటి సీసాలతోపాటు ఇతర తినుబండారాలను సేకరించి విజయవాడకు తరలిస్తున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చిన్న కుమారుడు మాగుంట నిఖిల్‌రెడ్డి రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. అలాగే, ఏపీఎన్జీఓ అసోసియేషన్ జిల్లా నాయకులు కూడా సోమవారం కలెక్టర్‌కు రూ.1,00,116 చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, నేతలు బి. వెంకటేశ్వర్లు, ఎస్.ఆంజనేయవర్మ, జి. రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

● కావలి రెడ్‌క్రాస్ విపత్తు విభాగ కన్వీనర్ బీద లక్ష్మీనంద నాయకత్వంలో రూ.1.10 లక్షల విలువైన మందులను విజయవాడకు చేరవేసింది.

● బుచ్చిరెడ్డిపాళెం : మెప్మా ఎండీ సహాయనిధికి సిబ్బంది రూ.59 వేలు అందజేశారు. అలాగే నిత్యావసర సరుకులు, వాటర్‌బాటిళ్లు, బిస్కెట్లను మెప్మా పీడీ రవీంద్రకు అందజేయగా సీఈఓ నర్మద, హర్షిత, ఆర్పీలను అభినందించారు.



కలెక్టర్‌కు విరాళం చెక్కును అందచేస్తున్న మాగుంట నిఖిల్ రెడ్డి

హెల్పింగ్ హ్యాండ్స్



కలెక్టర్ ఆనంద్‌కు చెక్కు ఇస్తున్న ఎన్జీవో సంఘం నాయకులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

గంగ ఒడికి గణనాథుడు

● వైభవంగా నిమజ్జన ఊరేగింపులు, గ్రామోత్సవాలు ● పలుచోట్ల లడ్డూల వేలం

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం పలుచోట్ల గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా ఊరేగింపు, గ్రామోత్సవంలోనూ పాల్గొన్నారు. పలుచోట్ల లడ్డూలను వేలం వేశారు. నీటి వనరులైన చెరువులు, కాలువలు, సముద్రంలో లంబోదరుడిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డీజే సౌండ్స్, బాణాసంచా కాల్పులు, కేరింతల మధ్య వినాయక విగ్రహాలను తరలించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన కార్యక్రమాల వివరాలు..




కలిగిరి : నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు, కొండాపురం : భీమవరప్పాడులో వినాయక నిమజ్జనంలో భక్తులు



ఉలవపాడు : అలగాయపాలెం సముద్రతీరంలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



జలదంకి : నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు



కందుకూరు : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడి విగ్రహం

కావలిటౌన్, సెప్టెంబరు9: పట్టణ పరిధిలోని పలు విగ్రహాలు సోమవారం తీరంలో నిమజ్జనానికి తరలివెళ్లాయి. యువత, చిన్నారులు, మహిళలు ట్రాక్టర్లు, మినీ లారీలు తదితర వాహనాల్లో తీరానికి వెళ్లారు. రంగులు చల్లుకుంటూ, బాణాసంచా కాల్చుకుంటూ, యువత చిందులు వేస్తూ నినాదాలు చేసుకుంటూ నిమజ్జనం నిర్వహించారు. బ్రిడ్జి కూడలిలో భగత్‌సింగ్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలందరికి వినాయకుడి ఆశీర్వాదం లభించాలని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాఘవేంద్ర కాలనీలో ఎమ్మెల్యే నివాసం సమీపంలో కాలనీవాసులు నిర్వహించిన నిమజ్జనోత్సవాన్ని సోమవారం ఎమ్మెల్యే దంపతులు పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి ప్రారంభించారు. కళాకారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా పట్టణంలోని మరికొన్ని విగ్రహాలను ఐదు, తొమ్మిదవ రోజున నిమజ్జనం చేయనున్నారు.

కలిగిరి : మూడురోజులుగా భక్తుల నుంచి పూజలందుకున్న మండలంలోని వినాయక విగ్రహాలు సోమవారం నిమజ్జనానికి బయలుదేరాయి. చలువ పందిళ్ల కింద కొలువుదీరిన గణనాథుడి విగ్రహాలను భక్తులు ఆటోలు, ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించి కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్ర తీరానికి తరలించారు. విగ్రహాల వెంట యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో వెళ్లారు.

ఉలవపాడు : గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు సోమవారం రామాయపట్నం, అలగాయపాలెం, చాకిచర్ల సముద్రతీరానికి భక్తులు విగ్రహాలను తరలించారు. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలను గ్రామాల్లో ఊరేగిస్తూ, బాణాసంచా పేలుస్తూ, రంగులు చల్లుకుంటూ తీరానికి చేర్చి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనాలు మరో మూడునాలుగు రోజుల వరకు కొనసాగనున్నాయి.

కొండాపురం : గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల నిమజ్జనం సోమవారం ఘనంగా జరిగాయి. మూడవరోజు అన్నదానం, ఉట్టికొట్టడం, యువతకు ఆటలపోటీలు నిర్వహించిన నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందచేశారు.గణనాథుడి దగ్గర ఉంచిన లడ్డూనూ వేలం చేశారు. గుడవళ్లూరు, ఆదిమూర్తిపురం, భీమవరప్పాడు తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో ఉంచి నిమజ్జనాలకు తరలించారు. మండల పరిధిలో 42 వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరిగాయని ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు.

జలదంకి : సోమవారం గణేషుడి విగ్రహాల నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. మండలంలో వందలాది విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. ఈ ఊరేగింపుల్లో యువకులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం విగ్రహాలను కావలిరూరల్ మండలంలోని సముద్రతీరానికి చేర్చి అక్కడ నిమజ్జనం చేశారు.

కావలి రూరల్ : మూడవరోజు సోమవారం గంగమ్మ చెంతకు గణపయ్యలను చేర్చి ఘనంగా నిమజ్జనం చేశారు. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం సముద్రతీరంలో నిమజ్జనాన్ని కోలాహలంగా నిర్వహించారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ రాజేశ్వరరావు బందోబస్తును పర్యవేక్షించారు. ఒకటవ పట్టణ సీఐ ఫిరోజ్ బ్రిడ్జి సర్కిల్ లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అలాగే రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐ బాలక్రిష్ణ తీరం వెంబడి గస్తీ నిర్వహించారు.

లింగసముద్రం : మండలంలోని లింగసముద్రంతో పాలు పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్, బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం, పెంట్రాల, గంగపాలెం, చినపవని, పెదపవని, అన్నెబోయినపల్లి తదితర గ్రామాలలో గణనాథుడి విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. సాయంత్రం నుంచి వినాయకుడి విగ్రహాలను యువకులు ట్రాక్టర్లపై ఉంచి డీజే సౌండ్లతో ఊరేగించారు. రాత్రికి రాళ్లపాడు ప్రాజెక్టు మన్నేరు, ఉప్పుటేరులలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో గణేషుడి విగ్రహాల నిమజ్జనం సోమవారం జరిగింది. పలు గ్రామాల్లో గణనాథుడి విగ్రహాల గ్రామోత్సవం అనంతరం తాటిచెట్లపాలెం సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. ఎస్సై భోజ్యా, సిబ్బంది తీరం వెంబడి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి 78కి పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో గణపతి విగ్రహానికి ఎమ్మెల్సీ శ్రీకాంత్ దంపతులు తొలి పూజలు చేశారు. సోమవారం జరిగిన నిమజ్జనంలో కరస్పాండెంట్ కంచర్ల రామయ్యతోపాటు కుటుంబ సభ్యులు, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ విజయ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిట్రగుంట : తాటిచెట్లపాళెం తీరంలో కోలాహలం

ఆత్మకూరు : పట్టణంలోని పలు కూడళ్లతో పాటు మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు ట్రాక్టర్లపై ఉంచి ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. వినాయకునికి పూజలు, భజనలు, కోలాటాలు మధ్య విగ్రహాలు ముందుకు సాగాయి. పట్టణంలోని పంటవీధి, యాదవ వీధి, తోటవీధి, నాగేంద్రపురం, జేఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, అరుంధతీయవాడ, హరిజనవాడ ప్రాంతాల్లో నిర్వహించిన లడ్డూ వేలం పోటాపోటీగా జరిగింది. సాయంత్రం నుంచి ప్రారంభమైన నిమజ్జనోత్సవం రాత్రి 10గంటలకు పైబడి కొనసాగింది. విగ్రహాలను అప్పారావుపాళెం సమీపంలోని పెన్నానది వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సీఐ గంగాధర్‌రావు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

సంగం: స్థానిక శివాజీ సెంటర్, వడ్డిపాళెం, తిరుమనతిప్ప కాలనీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ట్రాక్టర్‌లపై ఉంచి గ్రామోత్సవంగా వెళ్తూ పెన్నానదికి నిమజ్జనానికి తరలివెళ్లారు. శివాజీ సెంటర్ యువకులు మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చిన కళాకారుల వాయిద్యాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. అదే విధంగా సంగం చుట్టు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమ జ్జనానికి పెన్నానదికి తరలివచ్చారు. నది ప్రాంతంలో సీఐ వేమారెడ్డి పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి క్రేన్‌తోపాటు ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

● ఆరు కేజీల లడ్డూ రూ. 50,116లకు వేలం

కొరిమెర్ల గ్రామం శ్రీరామకృష్ణ ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జరిగిన లడ్డూ వేలం రూ. 50,116లు పలికింది. గ్రామానికి చెందిన సూదులగుంట పెంచలరెడ్డి అనే రైతు 6కేజీల లడ్డూను అత్యధికంగా వేలం పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో కొరిమెర్ల వినాయక యూత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని పలు కాలనీలతో పాటు గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. ఈ సందర్భంగా ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువత రంగులు చల్లుకొని కేరింతలు కొట్టారు. ఉదయగిరి పట్టణంలోని వాల్మీకివీధి, యాదవపాళెం తదితర ప్రాంతాల్లో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం సమీపంలో ఉన్న నీటి వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● వినాయక లడ్డూ వేలం రూ.1.35లక్షలు

ఏఎస్‌పేట: గుడిపాడులో వినాయకుడి 12కేజీల లడ్డూ వేలం నిర్వహించారు. ఇందులో గ్రామానికి చెందిన కాటం రవీంద్రరెడ్డి అత్యధింగా రూ.1.35 లక్షలు పాడి దక్కించుకున్నారు. మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లోని మండపంలో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

కలువాయి: మండలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు కోలాహలంగా నిర్వహించారు. పూజలు చేసిన అనంతరం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. మేళతాళాలు, బాణసంచా కాల్చుతూ కోలాటాలు, డ్యాన్స్‌లు చేస్తూ విగ్రహాలను తరలించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు



సంగం: గణేషుడి గ్రామోత్సవం



సీతారామపురంలో యువకుల కేరింత



లింగసముద్రం : చినపవనిలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

సీతారామపురం: మండలంలోని పలు గ్రామాల గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లారు. పెద్ద ఎత్తున యువకులు, మహిళలు, పిల్లలు ఉత్సాహంగా డప్పు వాయిద్యాలతో మధ్య బాణాసంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ సంతోషంగా ఊరేగింపుగా ముందుకు సాగారు. స్థానిక చెరువులో విగ్రహాలను పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ తిరుమలరెడ్డి, ఏఎస్‌ఐ వెంకటసుబ్బయ్య చర్యలు తీసుకున్నారు.

అనంతసాగరం: అన్నిగ్రామాల్లో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఉట్టి మహోత్సవం నిర్వహించి అనంతసాగరం చెరువులో నిమజ్జనం కోసం తరలించారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

వరికుంటపాడు: పాములూరుపల్లి, గొల్లపల్లి, జీ.కొండారెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, కాంచెరువు, దక్కనూరు, తూర్పుబోయమడగల తదితర గ్రామాల్లో నిర్వాహకులు విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మహిళలు దారి పొడవునా వారు కడవలతో నీరు పోసి కాయకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. పాములూరుపల్లిలో తెల్లగొర్ల సునీల్‌కుమార్ దంపతులు రూ.69వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. తెల్లగొర్ల సుధీర్‌బాబు రూ.20వేలకు కలశం, రెడ్లదిన్నెలో పోలయ్య రూ.15,500కు ప్రమిదలను స్వంతం చేసుకున్నారు. అలాగే కాంచెరువు బీసీకాలనీలో ఆలా మాధవరావు రూ. రూ.32వేలు, గొల్లపల్లిలో గంగవరపు పద్మయ్య రూ.15,700కు వేలం పాడారు.



వీకేపాడు : నిమజ్జనానికి తరలివెళ్తున్న లంబోదరుడు



ఏఎస్‌పేట : లడ్డూను దక్కించుకున్న రవీంద్రరెడ్డి

ఆర్వో ప్లాంటుకు భూమి పూజ

ఆత్మకూరు, సెప్టెంబరు 9: మున్సిపాలిటీ పరిధిలోని అనంతరాయుని యేని ఎస్టీ కాలనీలో కంచి పరమేశ్వర రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్‌కు సోమవారం మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మండలా ధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కంచి పరమేశ్వరరెడ్డి ఎస్టీ కాలనీవాసుల దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం హర్షదాయకం అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ రమాదేవి, వెంకటేశ్వర్లునాయుడు, మోహన్‌రెడ్డి ఉన్నారు.



భూమిపూజలో పాల్గొన్న కంచి పరమేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

అనంతసాగరం, సెప్టెంబరు 9: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, పెంచల నాయుడు, సత్తార్‌లు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ గిరీష్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ విధానాలతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరగడం, యజమాని సంతకంతో ముడిపెట్టి కౌలు రైతుకు గుర్తింపుకార్డులు ఇవ్వడంలో అభ్యంతరం నెలకొనడంతో అవస్థలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

బడిబయట పిల్లలను తరగతుల్లో చేర్పించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 9: బడిబయట, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి వారి వయసును బట్టి తరగతుల్లో చేర్పించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. యూడైస్ ప్లస్, డ్రాప్ బాక్స్‌లోని విద్యార్థుల జాబితాను తీసుకొని వారు ఎక్కడ ఉన్నారు.. ఏ పాఠశాలలో చదువుతున్నారు లేదా వలస వెళ్లారా అనే వివరాలను సేకరించి యాప్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలీం, సీఆర్‌ఎంటీలు సిద్ధయ్య, భోగ్యం శ్రీనివాసులు, మొహిద్దీన్ పాల్గొన్నారు.

పీకేపాడు చెరువులో మట్టి దోపిడీ

● ఇటుక బట్టీలకు తరలింపు

అనంతసాగరం, సెప్టెంబరు 9: పడమటికంభంపాడు ఎర్ర చెరువు నుంచి అదును చూసి మట్టి దోచేస్తున్నారు. వారంరోజుల వ్యవధిలో రాత్రుల పూట చెరువులో ఎక్స్‌కవేటర్లతో అక్రమ తవ్వకాలు జరిపి స్థానిక ఇటుక బట్టీలకు మట్టిని తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా మౌనం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతానికి భిన్నంగా చెరువు నుంచి మట్టి తరలింపుపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదును చూసి మట్టి తరలింపుపై నిఘా ఉంచి చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదిక

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 9: స్థానిక మండల కార్యాలయ ఆవరణలో మంగళవారం 17వ సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్చా వేదికకు మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

పొలంబడి కార్యక్రమం వాయిదా

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 9: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన పొలంబడి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోస్తాంధ్రాలో తుఫాను కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామని, తిరిగి ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

సొసైటీలో మహాజనసభ సమావేశం

సంగం, సెప్టెంబరు 9: స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం పర్సన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ రిజిస్ట్రార్ నిర్మల అధ్యక్షతన మహాజన సభ సమావేశం నిర్వహించారు. సొసైటీలోని 2,256 మంది సభ్యులకు కంప్యూటరీ కరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యులందరూ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ పద్మగిరి కుమారి, కార్యదర్శి దస్తగిరి పాల్గొన్నారు.

కందుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, సెప్టెంబరు 9: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కందుకూరు అభివృద్ధి మండలి పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పేర్కొన్నారు. ఏపీ ప్రొఫెషనల్స్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు అధ్యక్షతన సోమవారం అభివృద్ధి మండలి సమావేశాన్ని నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, పలు ప్రజాల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివి శివరాం మాట్లాడుతూ రాజకీయాలతో నిమిత్తం లేకుండా కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ప్రజా ప్రతినిధులకు తోడ్పాటుగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడమే ఈ మండలి లక్ష్యమన్నారు. నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా అభివృద్ధి మండలి తన వంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. సమావేశంలో నాయకులు పోకూరి మాలకొండయ్య, బీ.వెంకటేశ్వర్లు(టీవీ), పాలేటి కోటేశ్వరరావు, ఆర్‌వీ, బీ సురేష్‌బాబు, మల్లికార్జున, కాకుమాని మాధవరావు, బొల్లినేని నాగేశ్వరరావు, పీ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

వైద్యాధికారులపై చర్యలు చేపట్టాలని నిరసన



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

బిట్రగుంట, సెంప్టెంబరు 9: ఈ నెల 2వ తేదీన అల్లిమడుగు సంఘానికి చెందిన దినకూలీ బచ్చు శంకర్ పాము కాటుకు గురై సమీపంలోని కోవూరుపల్లి పీహెచ్‌సీలో వైద్యం అందక మృతి చెందాడని, అందుకు కారణమైన వైద్యాధి కారులపై చర్యలు చే పట్టాలని ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బోగోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట మృతుడు శంకర్ కుటుంబసభ్యులు, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లితో కలసి సోమవారం నిరసన తెలిపారు. తహసీల్దారు సురేష్‌బాబుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పాము కాటు వేసిన వెంటనే కోవూరుపల్లి పీహెచ్‌సీకి వెళ్లిన శంకర్‌కు ప్రథమ చికిత్స చేయక పోగా, వ్యాక్సిన్ లేదని వైద్యం చేయక పోవడం దారుణమన్నారు. అక్కడి నుంచి బాధితుడిని కావలికి తరలించడం ఆలస్యం కావడం వల్ల మృతి చెందాడని పేర్కొన్నారు. ముందుగా వైద్యం చేసి ఉంటే బతికే వాడని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చట్టరీత్యా చర్యలు చేపట్టి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

మందులతో విజయవాడకు రెడ్‌క్రాస్ బృందం

కావలి, సెప్టెంబరు 9: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాల నిర్వహణకు స్థానిక రెడ్‌క్రాస్ వైద్య సహాయ బృందం సోమవారం బయలు దేరింది. రెడ్‌క్రాస్ విపత్తు విభాగ కన్వీనర్ బీద లక్ష్మీనంద నాయకత్వంలో రూ.1,10,000ల విలువైన మందులను తీసుకుని వారు తరలివెళ్లారు. ఈ బృందానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, హరినా రపరెడ్డి, బీఎస్ ప్రసాద్, బాలు వీడ్కోలు పలికారు. రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ సుమారు వెయ్యి దుస్తుల కిట్లను కూడా సిద్ధం చేస్తున్నామని, త్వరలో వాటిని కూడా పంపిణీ చేస్తామన్నారు. వైద్య సహాయ బృందంలో సచికేతన్, సాయి కుమార్, వెంక టేశ్వర్లు, మధుసూదనరెడ్డి ఉన్నారు.



రెడ్‌క్రాస్ వైద్య సహాయ బృందానికి వీడ్కోలు చెపుతున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

వైసీపీ ఎంపీపీ తీరుపై విమర్శలు

● అధికారులపై పెత్తనం చెలాయింపు

ఏఎస్ పేట, సెప్టెంబరు 9: వైసీపీ ఎంపీపీ పద్మజారెడ్డి సోమవారం ఎంపీపీ కార్యాలయంలో పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి. చిరమన, ఏఎస్ పేట పీహెచ్‌సీల అభివృద్ధికి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో తహసీల్దారు, ఎంపీడీవో, వైద్యులు సభ్యులుగా ఉంటారు. సమావేశాన్ని పీహెచ్‌సీలో లేదా ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించకుండా ఎంపీపీకి కేటాయించిన గదిలో నిర్వహించడం చర్చనీయాంశం అయ్యింది. ఇటీవల స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ సమావేశానికి అధికారులు ఆలస్యంగా రావడంపై ఆమె ఫైర్ అయ్యారు. అదే సమయానికి మండలంలో కలెక్టర్ పర్యటించడంతో అధికారులు ఆయన వెంటే ఉన్నారు. సమావేశానికి కొంత ఆలస్యంగా వచ్చిన విషయాన్ని తెలిపినా వినకుండా అధికారులపై పైతనం చెలాయించారు.

బిర్యానీ పొట్లాల పంపిణీ

కావలిటౌన్, సెప్టెంబరు 9: ఆపద్బాంధవ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎంపీ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణయ్య సౌజన్యంతో సోమవారం పట్టణంలోని కావేరిగుంట గిరిజనులకు చికెన్ బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ వెంకటరమణయ్య తండ్రి తిరుపాలయ్య వర్ధంతిని పురస్కరించుకుని ప్రతిఏటా గిరిజనులకు బిర్యానీ పొట్లాలు పంపిణీ చేయడం ఆయన సేవాదృక్పథానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, ట్రస్ట్ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, మాలకొండారెడ్డి, మస్తానయ్య, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల

లింగసముద్రం, సెప్టెంబరు 9: మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.80,47,281 విడుదల అయినట్లు ఈవోఆర్డీ కేవీ రామసుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ నిధుల్లో టైడ్ రెండో విడత నిధులు రూ.48,28,374, అలాగే అన్‌టైడ్ రెండో విడత నిధులు రూ.32,18,907 ఉన్నాయని చెప్పారు. ఈ నిధులతో పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు, తాగునీటికి, రోడ్ల ఏర్పాటుకు, ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నట్లు వివరించారు.

సిబ్బందికి సన్మానం

బిట్రగుంట, సెప్టెంబరు 9: విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో విధులు నిర్వహించిన విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సిబ్బందిని సోమవారం బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో వెంకటసుబ్బారావు సన్మానించారు. బోగోలు, జువ్వలదిన్నె, సీఆర్‌పాలెం పంచాయతీల స్వీపర్లు ఏడుకొండలు, కృష్ణయ్య, జీవన్, మహేష్ సేవలను విశ్వనాథరావుపేట సర్పంచు జీ మంజుల, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు కొనియాడారు. వారికి నగదు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్వేత, ఏవో గోవిందరావు, టీడీపీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, ఎం.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో రోగాల పాలు

కావలి, సెప్టెంబరు 9: పట్టణ ప్రజలకు శుద్ధినీరు అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ కుళాయి కనెక్షన్ తీసుకోవాలని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే కుళాయిల్లో కలుషిత నీరు వస్తున్నా వారు చర్యలు తీసుకోవడంలేదు. పట్టణంలో ప్రధాన పైపులైన్ల నుంచి ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన వాల్వు గుంతలు నిర్వహణలోపంతో బురదగుంతలుగా మారాయి. వాటిలో పందులు పొర్లాడుతూ నీటిని కలుషితం చేయటంతో ప్రజలకు ఆ నీరే కుళాయిల్లో వస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదాలు ఉన్నాయి. మంచినీటి వాల్వుగుంతలపై మూత బండలు వేసి దాని పైన ఉన్న రంధ్రం ద్వారా వాల్వు ఆన్ అండ్ ఆఫ్ చేయాల్సి ఉంది. కానీ కావలిలో ఎక్కడా వాల్వు గుంతలపై మూతబండలు లేవు. వాటిల్లో చెత్తా చెదారం పడి మురికి గుంతలుగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వాల్వు గుంతలపై మూత బండలు వేయాలని కోరుతున్నారు.

టీడీపీ గూటికి చాకిచర్ల సర్పంచి

కందుకూరు, సెప్టెంబరు 9: ఉలవపాడు మండలం చాకిచర్ల సర్పంచి వీరమల్లు విజయమ్మ సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. అనంతరం సర్పంచి విజయమ్మను టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచితోపాటు 10వ వార్డు సభ్యుడు ప్రయకావేరి అంకయ్య, వైసీపీ నేత తోట వెంకటనారాయణలు కూడా టీడీపీలో చేరారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు మిరియం మల్లికార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.

● సబ్ కలెక్టర్‌ను కలిసిన ఇంటూరి

ఇటీవల సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తిరుమణి శ్రీపూజను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. పూల మొక్కను అందచేసి అభినందనలు తెలిపారు. కాగా మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొర్రపాటి అనూష సోమవారం ఎమ్మెల్యేను ఇంటివద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

స్వయం ప్రతిపత్తిపై అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 9: సాధికారత, స్వయం ప్రతిపత్తిపై స్థానిక టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సాధికారత విభాగాన్ని విద్యార్థులకు పరిచయం చేశారు. మహిళా సాధికారత కన్వీనర్ షేక్ షానాజ్ బేగం మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకురాళ్లు డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ ఐ అనూష, డాక్టర్ కే సుజాత, ఎం జ్యోతి, ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కన్వీనర్, పీడీ డాక్టర్ కరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.